ఎరువుల కోసం తోపులాట

రోడ్డుపై బైఠాయించిన రైతులు

: పిఏసిఎస్ వద్ద ఉద్రిక్తత - ఫర్నిచర్ ధ్వంసం

విశాలాంధ్ర-గజపతినగరం : గజపతినగరం పిఏసిఎస్ వద్ద సోమవారం రైతులు ఉదయం తెల్లవారు నుండి యూరియా కోసం బారులు తీరి ఉన్నారు. యూరియా స్టాక్ ఉండడంతో వచ్చిన రైతులు యూరియా దొరుకుతుందో లేదో అని ఆందోళన చెంది తోపులాటకు దారితీసింది. అనంతరం ఆఫీస్ ఫర్నిచర్ ను చెదగగొట్టి, ఆఫీస్ తలుపులను తోపులాడి అనంతరం రోడ్డుపై బెటాయించారు ట్రాఫిక్కు అంతరాయం కలిగించారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి రైతులను అదుపు చేసే ప్రయత్నం చేశారు అనంతరం రైతులు యూరియా కోసం క్యూ లైన్ కట్టి పెద్ద ఎత్తున ఎగబడ్డారు.

అందరి సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు

జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: జిల్లా ఎస్పీగా ఎ.ఆర్.దామోదర్ జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పోలీసు కార్యాలయం వద్ద జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపిఎస్ మాట్లాడుతూ - జిల్లా ఎస్పీగా రెండోసారి బాధ్యతలు స్వీకరించడం తనకు ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన అంశాలకు ప్రాధాన్యత కల్పించి, అందరి సహకారం, సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలందిస్తామన్నారు. జిల్లాలో గంజాయి నియంత్రణ, మహిళలు, బాలల భద్రత, సైబరు నేరాల నియంత్రణ, రహదారి భద్రతకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. జిల్లాలో గతంలో 2019 సం. ఎన్నికల నిర్వహణలో పని చేసిన అనుభవం ఉందని, ఇక్కడ పరిస్థితుల పట్ల సంపూర్ణ అవగాహన ఉందని, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని, ఎటు వంటి శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా పటిష్టమైన భద్రత చర్యలు చేపడతామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లాలో రహదారి ప్రమాదాల ను నియంత్రించేందుకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతామని, వాహనదారులు హెల్మెట్ ధరించే విధంగా చూస్తామన్నారు. జిల్లా ప్రజలు, నాయకులు, సోషల్ ఆర్గనైజేషన్స్, స్వచ్ఛంద సంస్థలు సహకారంతో ప్రజలకు మెరుగైన పోలీసు సేవలను అందిస్తామని, అందుకు ప్రజలు, మీడియా ప్రతినిధులు తమవంతు సహకారాన్ని అందించాలని కోరారు. జిల్లాలో ఎస్పీగా బాధ్యలు స్వీకరించేందుకు విచ్చేసిన ఎఆర్ దామోదర్ కు అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ జి. నాగేశ్వరరావు, డిపిటి ఎటి పి.శ్రీనివాసరావు, లీగల్ అడ్వయిజర్ వై.పరశురాం, పలువురు డిఎస్పీలు, సిఐలు, రిజర్వు ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు స్వాగతం పలికి, పుష్ప గుచ్ఛాలను, పూల మొక్కలను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న జగన్ & కంపెనీ

ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు

విశాలాంధ్ర-చీపురుపల్లి: దేశ రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ జగన్ అండ్ పార్టీ ప్రజల విశ్వాసాలను దెబ్బతీస్తున్నారని చీపురుపల్లి శాసన సభ్యులు కిమిడి కళా వెంకట్రావు అన్నారు. సోమవారం నాడు చీపురుపల్లి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 151 స్థానాలు గెలుచుకున్న జగన్మోహన్ రెడ్డి గడిచిన ఐదేళ్లలో ప్రజా వ్యతిరేక పాలన, రాక్షస పరిపాలన కొనసాగించడం వల్లనే ప్రజలు 11 స్థానాలకే పరిమితం చేశారని ఈ సందర్భంగా ఆయన ఎద్దేవా చేశారు. ప్రజలు వ్యతిరేకించి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని 11 స్థానాలకే పరిమితం చేసినప్పటికీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వైయస్ జగన్మోహన్ రెడ్డికి కనీస పరిపక్వత కలగలేదని ఆయన అన్నారు. ప్రతిపక్ష హోదాలో అసెంబ్లీకి హాజరు కావడానికి కూడా వైసిపి నాయకులు ఎందుకు భయపడుతున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతరిస్తున్నప్పటికీ చూసి ఓర్వలేక పెట్టుబడులు పెట్టే కంపెనీలు సైతం జగన్మోహన్ రెడ్డి బెదిరిస్తున్నారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. జగన్మోహన్ రెడ్డి అండ్ కంపెనీ బొత్స సత్యనారాయణ తదితరులు జగన్కు వత్తాసు పలుకుతూ పెట్టుబడిదారులను భయపెడుతూ రాష్ట్ర అభివృద్ధి జరగకుండా అడ్డుపడుతున్నారని ఈ సందర్భంగా ఆయన అన్నారు. దేశం మీద రాష్ట్రం మీద కనీసం వారు పుట్టే గ్రామం మీద కూడా విశ్వాసం లేని నాయకులుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్టుబడులు పెట్టి రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరిగిన, టెండర్లు పిలిచిన తాము మళ్ళీ అధికారంలోకి వచ్చిన వెంటనే వాటన్నింటినీ నిర్వీర్యం చేస్తామంటూ బహిరంగ ప్రకటన చేయడం ప్రజాస్వామ్య వ్యతిరేకమన్నారు. రాజకీయ చరిత్రలో ఏ నాయకుడు కూడా ఇటువంటి ప్రకటనలు చేయలేదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలు సరైనవి కాదన్నారు. అధికారంలో ఉండగా విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం ఎందుకు ప్రశ్నించలేదని ఆయన అడిగారు. పదవి వ్యామోహం ముఖ్యమంత్రి హోదా, వంటి వ్యామోహాలకు గురవుతూ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారని ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి కాంగ్రెస్ నాయకులకు ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా ఆ పార్టీ నాయకులు పరిపక్వత చెంది ప్రజా సంక్షేమం కోసం ఆలోచన చేయాలని ఈ సందర్భంగా ఆయన పలికారు. 11 సీట్లకే పరిమితమైన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అసెంబ్లీకి హాజరు కావడానికి ఎందుకు వెనకడుగు చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కనీసం ప్రజల సమస్యల కోసం అయినా ప్రశ్నించడానికి అసెంబ్లీకి హాజరుకావాలని ఆయన ఆహ్వానించారు. 33 వేల కోట్ల అప్పుల భారంతో రాష్ట్రాన్ని అధోగతి పట్టించిన ఘనత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు రౌతు కామ నాయుడు, ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, గరివిడి మాజీ ఎంపీపీ పైల బలరాం, తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నైట్ యువర్ స్టార్టప్: ఫ్రం విజన్ టు వెంచర్ అనే అంశంపై వర్క్‌షాప్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ సీతం లో డిపార్ట్మెంట్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ ఆధ్వర్యం లో ఇగ్నైట్ యువర్ స్టార్టప్: ఫ్రం విజన్ టు వెంచర్" అనే లివర్క్‌షాప్‌లి డిపార్ట్మెంట్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ కె. సాయి నిశాంత్, సి ఈఓ, ఎ టీ ఓ ఎం టిఇ పాల్గొని, విద్యార్థులకు స్టార్టప్ ఆవిష్కరణ, ఆలోచనలను విజయవంతమైన బిజినెస్ గా మలచుకునే మార్గాలు, అవకాశాలు సవాళ్లపై విలువైన సూచనలు అందించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణ రావు విద్యార్థులుస్టార్టప్ కల్చర్ ను ఆచరణలో పెంపొందించుకోవాలని ప్రోత్సహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్ కెరీర్ డెవలప్మెంట్ కు ఉపయోగించుకోవాలని సూచించారు. డిపార్ట్మెంట్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ హెచ్‌వోడి డాక్టర్ ఎస్. వరూధిని వర్క్‌షాప్ ప్రాముఖ్యతను వివరించి, విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్మెంట్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూరియాకై రైతులు ఎదురుచూపులు

ప్రేక్షక పాత్ర పోషిస్తున్న అధికారులు

విశాలాంధ్ర-మెరకముడిదాం: రైతులు కోసం ప్రభుత్వం పంపిణీ చేసిన యూరియా లేక రైతుల నానా అవస్థలు పడుతున్నారు. రైతులుకు పడిగాపులు, శ్రమే మిగులుతుంది తప్పా యూరియా అందిన పాపాన పోలేదు. కొన్ని దగ్గర్ల ఉన్న రైతులుకు ఒకటి చొప్పున ఆధార్ కార్డు , వన్ బి ఆధారంగా పంపిణీ చేసి మిగతా యూరియాను కొంత మంది పట్టించుకోవటంతో రైతులు పడిగాపులు కాయాల్సి వస్తుంది. గంటలు తరబడి రైతులు నిరీక్షించినా చేసిన ఆయా ప్రయోజనం సూన్యమే. దీంతో కొంతమంది రైతులు ఈసురో మనుకొని వెనుదిరగాల్సి వచ్చింది. యూరియా రైతులుకు మాత్రం అందిన దాఖలాలు లేవు. దీంతో రైతులుకు యూరియా అందని ద్రాక్షగా మారింది. కాబట్టి ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రైతులుకు యూరియా అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉచిత బస్సు తో రోడ్డు ను పడ్డ ఆటో కార్మికుల సమస్య పరిష్కారానికై 17న జిల్లా బంద్

విశాలాంధ్ర -బొబ్బిలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు మహిళలకు ఫ్రీ బస్సు పథకం కారణంగా రోడ్డు ను పడ్డ ఆటో డ్రైవర్స్ కు ప్రత్యామ్నయం కల్పించి నెలకు 25 వేల రూపాయలు ఇవ్వాలని జీవో నెంబర్ 21, ఈ చలానా, ఆర్టీవో వేధింపులు, ప్రైవేట్ ఫిట్నెస్ సెంటర్ రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 17 ఆటోలు బంద్ చేపడుతున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆటో స్టాండ్ లో ఆటో యూనియన్ నాయకులు బి టి ఆర్ నాయకత్వంలో గోడ పత్రికలను విడుదల చేశారు. నిరుద్యోగం పెరిగి ఉపాధి లేక సొంత ఉపాధితో బతుకుతున్న ఆటో కార్మికులకు ప్రభుత్వ విధానాలు కారణంగా వాళ్ల బతుకులు మరింత ధుర్భరంగా మారనున్నాయని అన్నారు. కేరళ తరహాలో ఆటో కార్మికులను ఆదుకోవడానికి ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు. 17వ తారీకు ఉదయం తొమ్మిది గంటలకు బొబ్బిలిలో ఉన్న ఆటో కార్మికులందరూ ఆర్టీసీ కాంప్లెక్స్ దరి జరిగే నిరసన కార్యక్రమంలో పాల్గొవాలని తెలిపారు. ఈ పోస్టల్ ఆవిష్కరణలో మోహన్, ఎస్ గోపాల్ కార్మికులు పాల్గొన్నారు.

సింగరాయి పాఠశాల సందర్శన : ఎంఈఓ భాస్కరరావు

విశాలాంధ్ర -వేపాడ: మండలంలోని సింగరాయి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి వి.బాల భాస్కరరావు సోమవారం సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా పాఠశాలలో ప్రార్థన నిర్వహణ శ్రద్ధగా జరుగుతున్న విధానాన్ని ఆయన ప్రశంసిం చారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, టాయిలెట్స్, కిచెన్ గార్డెన్ తదితర వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీషు పాఠాలు, చతుర్విధ ప్రక్రియలు, అభినయ గేయాలు, ఇంగ్లీషు రైమ్స్ ప్రదర్శనలను పరిశీలించి అభినందించారు. విద్యార్థుల వర్క్ బుక్స్, టీచర్ హ్యాండ్ బుక్స్‌తో పాటు అన్ని రికార్డులను కూడా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం సిబ్బందిని, ఆయాను కలిసి తగిన సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి కె. రామప్రసాద్ వై. వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధి హామీ బకాయిలు విడుదల

విశాలాంధ్ర భోగాపురం: మండలంలోని ఉపాధి హామీ కార్మికులకు బకాయిలు విడుదలయ్యాయని ఏపీవో భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలో మొత్తం 9800 మంది దారులకు చెల్లించాల్సిన రూ.3 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఈ మొత్తాన్ని త్వరలోనే వేతన్దారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్టు పేర్కొన్నారు.

..

17న జరిగే ఆటో, టాటా మ్యాజిక్ జిల్లా బంద్ ను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సెప్టెంబర్ 17న జరిగే ఆటో టాటా మ్యాజిక్ జిల్లా బంద్ ను విజయవంతం చేయాలనిసోమవారం తోటపాలెం లో ఉన్న ఎల్బీజీ భవన్ లో ఏఐటీయూసీ ఏఐఎఫ్టియు న్యూ,సిఐటియు, రవాణా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కోరారు ఈ సందర్భంగా.ఏఐఎఫ్టియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.నారాయణరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎస్‌రంగరాజు,సిఐటియు జిల్లా అధ్యక్షులు కే.సురేష్, మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి షరతులు లేకుండా లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో,క్యాబ్ ఇతర రవాణారంగా కార్మికులకు వాహన మిత్ర అమలు చేయాలన్నారు. ఉచిత బస్సు పథకం వలన నష్టపోయిన ఆటో, టాటా మ్యాజిక్ డ్రైవర్స్ కు 25వేలు ఇవ్వాలన్నారు. జీవో నెంబర్ 21,31 లను రద్దు చేయాలి. పోలీసులు,ఆర్టీవో వేధింపులు ఆపాలి. ప్రైవేట్ ఫిట్నెస్ సెంటర్ రద్దు చేయాలని.336 సెక్షన్ క్రింద లోకా దలత్ కేసులు నిలుపుదల చేయాలి. ఓలార్, ఓబర్,రాపిడో వంటి యాప్స్ రద్దు చేసి ప్రభుత్వమే ఒక యాప్ను పెట్టాలన్నారు. రవాణా రంగా కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటుచేసి. గ్రీన్,టోల్ టాక్స్ రద్దు చేయాలన్నారు. వాహనాలు కొనుగోలుకు ప్రభుత్వమే రుణాలు ఇవ్వాలని తదితర డిమాండ్స్ పై బంద్ లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి ఏ.జగన్మోహన్,ఏఐఎఫ్ టి యు న్యూ అధ్యక్షులు అప్పలరాజు రెడ్డి, యూనియన్ నాయకులు పాపారావు,ఈశ్వర్ రావు, రామునాయుడు, కుర్మారావు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

గురజాడ జయంతి రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలి : భీశెట్టి

ఎమ్మెల్యే బేబినాయన కి పౌరవేదిక బృందం వినతి

విశాలాంధ్ర-బొబ్బిలి/విజయనగరం రూరల్: సమాజంలోని సామాజిక మార్పుకోసం తన పదునైన రచనలతో ప్రజా చైతన్యం కోసం కృషి చేసిన మహా కవి గురజాడ అప్పారావు జయంతి ని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండగలా చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో మాట్లాడాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్. వి. ఎన్. కె. కె. రంగారావు(బేబినాయనని)కోరారు. సోమవారం పౌరవేదిక బృందం తో కలిసి వినతిపత్రం అందచేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రముఖుల జయంతి,వర్ధంతి లను రాష్ట్ర ప్రభుత్వం వేడుకలుగా చేసే లిస్టులో లేదని జీఓ నెంబర్ 689 తేదీ 10-4-2025 న విడుదల చేసిన ఈ జీఓ లో గురజాడ అప్పారావు పేరు లేకపోవడంతో గురజాడ అభిమానులు,జిల్లా ప్రజలు ఆవేదన చెందుతున్నారని భీశెట్టి అన్నారు,సెప్టెంబర్ 21 ఆదివారం జరగనున్న గురజాడ అప్పారావు 163 వ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఉత్సవం లా నిర్వహించాలని జిల్లా లోని ఎమ్మెల్యేలకు,మంత్రి కొండపల్లి కి నివేదికను అందిస్తా మని,ప్రజల అభిప్రాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేం దుకు ఈనెల17 న బుధవారం విజయనగరం లో గురజాడ అప్పారావు విగ్రహం వద్ద దీక్ష చేపడతామని ప్రకటించారు. ఎమ్మెల్యే ని కలిసిన వారిలో పౌరవేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ పిడకల ప్రభాకరరావు, ఇప్పలవలస గోపి,తుమ్మగంటి రామ్మోహన్ రావు,తాట్రాజు రాజారావు,బోర రమేష్,తదితరులు పాల్గొన్నారు.

అంగీకార్ అనే కేంద్ర ప్రభుత్వ విధానం పట్ల ప్రతి ఒక్కరు చైతన్యం కావాలి

విశాలాంధ్ర-విజయనగరం: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం అమలులో భాగంగా అంగీకార్ అనే కేంద్ర ప్రభుత్వ విధానం పట్ల ప్రతి ఒక్కరు చైతన్యం కావాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య,గృహ నిర్మాణ సంస్థ పి.డి జి. మురళీమోహన్ అన్నారు. ఈ మేరకు అంగీకార్ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. సోమవారం కమిషనర్ ఛాంబర్ లో అంగీకార్ 2025 తో పాటు, ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకాల వివరాలతో కూడిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ అందరికీ సొంత ఇల్లు కల్పించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు 1,50,000 సబ్సిడీగా అందించిందన్నారు. కానీ 2.0 ప్రకారం ఇక నుండి 2 లక్షల 50 వేల రూపాయలను సబ్సిడీగా అందించ నున్నదని అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో 2.0 పథకం అమలు కింద 700 మంది గృహ లబ్ధిదారులను ఎంపిక చేయడమైనదని అన్నారు. ప్రతి ఒక్కరు సూర్య ఘర్ పథకం ద్వారా ప్రభుత్వ సబ్సిడీని వినియోగించుకుని సౌర ఫలకలను ఏర్పాటు చేసుకోవా లన్నారు. గృహ నిర్మాణ సంస్థ పిడి మురళి మోహన్ మాట్లాడుతూ సొంత ఇంటి కల నెరవేర్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 2.50 లక్షలు మంజూరు చేస్తున్న నేపథ్యంలో ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. నూతన విధానం ద్వారా త్వరితగతిన దరఖాస్తుల పరిశీలన, ఇంటింటికీ అవగాహన కల్పించడం వంటివి అంగీకర్ ప్రత్యేకతలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిఈ జివి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడ అందుబాటులో యూరియా నిల్వలు

రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర-విజయనగరం: ప్రస్తుత సీజన్ లో పంటల సాగుకు అవసరమైన యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్చిన అవసరం లేదని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు అవసరమైన మేరకు యూరియాను అందించేందుకు తగిన చర్యలు తీసుకున్నామని ఆయన తెలియజేశారు. ఈరోజు గజపతి నగరంలో జరిగిన సంఘటన దురదృష్టకరమని, కొందరు కావాలని చేసే ప్రచారాన్ని నమ్మవద్దని పద్ధతి ప్రకారం ఎప్పుడు ఎంత యూరియా అవసరమో అంత యూరియా అందిస్తామని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు సమర్థవంతంతా పనిచేసి క్షేతస్థాయిలో ఉన్న అపోహలను నివారించాలని సూచించారు. పంటల సాగునుబట్టి యూరియా సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించామని అన్నారు. సాగు విస్తీర్ణానికి అనుగుణంగా జిల్లాలో తగినంతగా యూరియా అందించటం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామని మంత్రి తెలియజేశారు. ఈ సీజన్లో ఇప్పటి వరకు 29,574 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించటం జరిగిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 700 మెట్రిక్ టన్నుల యూరియా ఆర్ ఎస్ కె లు, ప్రయివేటు వర్తకుల వద్ద సిద్ధంగా ఉందని తెలిపారు. రాబోయే రెండు మూడు రోజులలో 1180 టన్నులు యూరియా జిల్లాకు రానుందని తెలిపారు. ఇది కాకుండా ఈ నెలాఖరుకి మరో మూడు వేల మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని తెలిపారు. ఇది జిల్లా అవసరాలకు సరిపోతుందని, అందువల్ల రైతులు షాపులవద్ద గంటల తరబడి క్యూల్లో నిల్చోవాల్సిన అవసరం లేదని మంత్రి సూచించారు. అందరికీ సజావుగా యూరియాను అందించేందుకు తగిన చర్యలను తీసుకున్నామని, రైతులు ఆందోళన చెందవద్దని కోరారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అక్రమ నిల్వలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, యూరియా పంపిణీని పర్యవేక్షించాలని కోరారు. కొనుగోలు విషయంలో రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటి కప్పుడు తెలుసుకుని అందుకు అనుగుణంగా తక్షణ చర్యలు తీసుకోవాలని, రైతులకు ఉన్న అపోహలను నివృతి చేయాలని అధికారులను ఆదేశించామని మంత్రి శ్రీనివాస్ ఈ ప్రకటనలో వివరించారు.

కొటారుపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద యూరియా పంపిణీ

పలు గ్రామాల నుంచి భారీగా తరలివచ్చిన రైతులు

యూరియాకై ఆందోళన వలదు : తాహసిల్దార్ నీలకంఠేశ్వర్ రెడ్డి

విశాలాంధ్ర-గంట్యాడ: గంట్యాడమండలంకొటారుబిల్లి రైతు సేవ కేంద్రం వద్ద సోమవారం తహసిల్దార్ నీలకంటేశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. పలు గ్రామాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన రైతులను క్రమ పద్ధతిలో క్యూలో నిలబెట్టి రైతులందరికీ యూరియా అందుతుంది ఎవరు ఆందోళన చందవలసిన అవసరం లేదని తాసిల్దార్ రైతులకు చెప్పారు. దగ్గరుండి అందరిని తోపులాట లేకుండా పోలీసుల సహకారంతో వరుసలో నిలబెట్టించారు. వరుస క్రమంలో వారందరికీ యూరియా టోకెన్లను అందజేశారు. క్యూలో నిలిచిన రైతులకు మంచినీళ్ల సౌకర్యాన్ని తహసిల్దార్ నీలకంటేశ్వర్ రెడ్డి ఏర్పాటు చేశారు. రెవెన్యూ వ్యవసాయ పోలీస్ సచివాలయ ఉద్యోగులు మహిళా సంరక్షణ పోలీసులు దగ్గరుండి యూరియా పంపిణీ తీరును పర్యవేక్షించారు. తహసీల్దార్ నీలకంటేశ్వర్ రెడ్డి , పోలీసుల సహకారంతో పూర్తి ప్రశాంత వాతావరణంలో యూరియా పంపిణీ కార్యక్రమం జరిగింది. రైతులందరికీ యూరియా అందడంతో ఆనందం వ్యక్తం చేశారు.

దళిత రణభేరిని విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-లక్కవరపుకోట: ఈనెల 24న రాష్ట్ర రాజధాని విజయవాడ ధర్నా చౌక్ (గాంధీనగర్) వద్ద జరగబోవు దళిత రణభేరి నీ విజయవంతం చేయాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి భవాని కృష్ణ పిలుపునిచ్చారు సోమవారం మండల కేంద్రంలోని బీఎస్పీ ఎస్ కోట నియోజకవర్గం ధోని అప్పారావు అధ్యక్షతన దళిత రణభేరి కరపత్రాన్ని రాష్ట్ర కార్యదర్శి బోని కృష్ణ ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఎస్సీలపై అనేక దాడులు ఆరాచకాలు, వేధింపులు, హత్యలు విపరీతంగా జరుగుతున్నాయని ప్రభుత్వము ప్రభుత్వ యంత్రాంగం చూస్తూ ఎలాంటి చర్యలు తీసుకోకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఎస్సీల మధ్య గొడవలు పెట్టి విడివిడిగా వారిపై దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి ఏకపక్షంగా వ్యవహరించి ఎస్సీల పట్ల కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఇకనైనా ఎస్సీలు ఒక తాటిపైకి వచ్చి వారి యొక్క హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఏపీ రాష్ట్రాన్ని అప్పుల భారంతో ముంచివేశారని ఉచిత పథకాల పేర్లతో ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. ప్రజలకు ప్రధానంగా కావలసిన విద్య, వైద్యం, ఉపాధి లేకుండా ప్రైవేటు వ్యక్తులకు కొమ్ముకాస్తూ వారిచ్చిన వేలాది ముడుపులు తీసు కొని సంక్షేమం గాలికి వదిలేశారు అని అన్నారు. రాష్ట్రంలో నీటి సమస్య, రోడ్లు, కాలువలు, రైతులకు మెరుగైన విత్తనాలు, ఎరువులు ఇలా అనేక సమస్యలు రాష్ట్ర వ్యాప్తంగా టీవీలలో, దినపత్రికలలోనూ రోజువారీ చూస్తూనే ఉంటున్నాము అన్నారు. హైటెక్ వాగ్దానములు చేస్తూ ప్రజలను నిలువునా ముంచేస్తున్నారని హితవు పలికారు. ఇకనైనా ప్రజలు ఉచిత పథకాలను వాటి వెనుకున్న రాజకీయ కుట్ర గమనించాలని కోరారు. ఈనెల 24న విజయవాడలో జరగబోవు దళిత రణభేరిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి చైతన్యకుమార్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కర్రు దేముడు, చెలికాని వెంకటరావు, కాకర అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఒక నిండు ప్రాణాన్ని కాపాడిన ఇద్దరు చిన్నారులు

విశాలాంధ్ర-గరివిడి: మండలంలో గల కోడూరు గ్రామంలో చిన్నారులు ప్రదర్శించిన అపూర్వ సమయస్ఫూర్తి, సాహసం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఐదో తరగతి చదువుతున్న ఇద్దరు బాలికలు, తమ ధైర్యసాహసాలతో ఒక ప్రాణాన్ని కాపాడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. సమాచారం ప్రకారం, కోడూరు ఎంపియు ప్రాథమిక పాఠశాల విద్యార్థినులు గేదెల దేదీప్యా (5వ తరగతి), గేదెల చరిస్మా (5వ తరగతి) స్కూలు నుండి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో రహదారిపై నడుస్తున్న ఎలకల ఆదినారాయణ అనే వ్యక్తి కాళ్ల వద్దకు పాము చేరింది. క్షణం ఆలస్యం అయితే ఆ వ్యక్తి ప్రాణాపాయం తప్పదని గ్రహించిన ఆ చిన్నారులు భయపడకుండా వెంటనే సమయస్ఫూర్తి ప్రదర్శించి ఒక్క ఉదుటలో అతడ్ని పక్కకు లాగారు. దీంతో ఒక పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సంఘటనను ప్రత్యక్షంగా చూసిన స్థానికులు ఆ పిల్లల ధైర్యాన్ని కొనియాడుతూ, చిన్నవయసులో ఇంతటి అప్రమత్తత నిజంగా స్ఫూర్తిదాయకం అని ప్రశంసించారు. గ్రామంలోని పెద్దలు, ఉపాధ్యాయులు ఆ ఇద్దరు బాలికలను అభినందించారు.

డీఎస్సీ ఫలితాలలో భవానికి మొదటి ర్యాంక్

విశాలాంధ్ర-దత్తిరాజేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన డిఎస్సి ఫలితాలలో దత్తిరాజేరు మండలం గడసాం గ్రామానికి చెందిన కడగల భవాని టి.జి.టి ప్రత్యేక భౌతిక శాస్త్రం విభాగంలో రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంక్ సాధించారు. ప్రస్తుతం ఈమె మరడాం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నారు. భర్త, తల్లిదండ్రులు మరియు అత్త మామల పూర్తి స్థాయి సహకారం తనను ఈ స్థాయిలో నిలిపిందని ఆమె తెలిపారు. దీంతో ఆమె పుట్టిన గ్రామం మధుపాడ, అత్త వారి గ్రామం గడసాం గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

అరెస్టులతో ఉద్యమాన్ని అణిచివేయలేరు

యూటిఎఫ్ జిల్లా నాయకులు ప్రసన్న కుమార్

విశాలాంధ్ర-రామభద్రపురం: రాష్ట్రస్థాయి యుటిఎఫ్ నాయకులు వెంకటేశ్వర అరెస్టు చేసినంత మాత్రాన ఉద్యమాన్ని ఆవలేరని జిల్లా యుటిఎఫ్ సహ అధ్యక్షులు ప్రసన్నకుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విద్యాశాఖ కార్యాలయం వద్ద రణభేరి పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ప్రసన్ కుమార్ మాట్లాడారు. ఉపాధ్యాయుల కు రావలసిన బకాయిలపై యుటిఎఫ్ నాయకులు శాంతియుతంగా పోరాటాలు చేస్తే వారిని అరెస్టులతో భయభ్రాంతులకు గురి చేయడం చాలా దారుణమని అన్నారు. ఎంతమంది నాయకులను అరెస్టు చేసిన ఎంతమంది పై కేసులు నమోదు చేసిన ఉపాధ్యాయులు భయపడే ప్రసక్తి లేదని అన్నారు. ఉపాధ్యాయులను కేవలం బోధన వరకే వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగర వాసులకు తీరనున్న కష్టాలు

విశాలాంధ్ర-విజయనగరం: నగర వాసులకు తాగునీటి కష్టాలు తీరనున్నాయి. ఏటా వేసవి వస్తే చాలు నీటి సమస్య తీవ్రంగా మారుతుంది. నెల్లిమర్ల, మధపాడ పథకాల ద్వారా నీరు సరిగా రాకపోవడంతో నేటికీ రోజు తప్పించి రోజు తాగునీరు పంపిణీ చేయాల్సిన పరిస్థితి అనేక ఏళ్లుగా కొనసాగుతోంది. ప్రస్తుతం రోజూ వచ్చే 15 ఎంఎల్ నీరు వేసవి వస్తే 10 ఎంఎల్డి కి తగ్గిపోతోంది. దీంతో ప్రతి ఏడాది తోటపల్లి నుంచి లేదా ఆంధ్ర ప్రాజెక్టుల నుంచి నీరు తెప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి కొనసాగింది. కేంద్ర ప్రభుత్వం నీటి సామర్థ్యాలు పెంపుకోసం అమృత 2.0 పథకం ద్వారా నిధులు కేటాయించింది. చెరువులు, నీటి పథకాల నీటి సామర్థ్యం పెంపుదలకోసం నిధులు కేటాయించారు. అందులో భాగంగానే విశాఖ రీజనల్ పరిధిలో పలు మున్సిపాలిటీలకు, నగరపాలక సంస్థలకు నిధులు కేటాయించారు. అందులో భాగంగా విజయనగరం నగర వాసులకు ప్రధాన నీటి వనరైన మధుపాడ నీటి పథకానికి రూ.66.38 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో పూర్తి స్థాయిలో పైప్ లైన్ మరమత్తులు వేయడంతోపాటు, మధుపాడ ద్వారా 3 ఎంఎల్డీ నీటి సామర్థ్యం పెంచడం దీని ముఖ్య ఉద్దేశం. పబ్లిక్ హెల్త్ శాఖ ద్వారా ఈ పనులు చేపట్టనున్నారు. విజయ నగరానికి మధుపాడ వద్ద పంపు హౌస్ త్వరలో టెండర్లు ఖరారు కానున్నాయి. అమృత పథకం ద్వారా నీటి సామర్థ్యం పెంపుదల కోసం రూ.66.38 కోట్లు నిధులు విడుదలయ్యాయని కమీషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు.

ఆదర్శ పాఠశాలలో ఘనంగా జాతీయ భాష దినోత్సవం

విశాలాంధ్ర - వేపాడ : మండల కేంద్రమైన వేపాడ శివారు బక్కునాడు పేటలో గల ఆదర్శ పాఠశాలలో జాతీయ భాష హిందీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా విద్యార్థులు "హిందీ దివస్" ఆకారంలో కూర్చుని ఆకర్షణీయంగా అలరించారు. హిందీ వర్ణమాల రూపకల్పనతో విద్యార్థులు చేసిన ప్రదర్శనలు విశేషంగా నిలిచాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాటలు, నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగాప్రిన్సిపాల్ ఈశ్వరరావు మాట్లాడుతూ హిందీ భాష ప్రాధాన్యత, దేశ ఏకత కోసం జాతీయ భాష పాత్రను వివరించారు. ఈ వేడుకలో హిందీ ఉపాధ్యాయుడు ఎస్. రామునాయుడు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మోక్షగుండంకు ఇంజనీర్ల ఘననివాళి

విశాలాంధ్ర - కొత్తవలస: భారతరత్న, మహెూన్నత భారతీయ ఇంజనీర్ సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి పురస్కరించుకుని సోమవారం ఇంజనీర్స్ డే సందర్భంగా కొత్తవలస మండలంలోని పలు సచివాలయాల్లో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న పలువురు యువ ఇంజనీర్లు కొత్తవలస తహసీల్దార్ కార్యాలయంలోని మోక్షగుండం విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోక్షగుండం నేటి యువతకు ఆదర్శప్రాయమని కొనియాడారు.

23 నుంచి అంతర్ జిల్లా కబడ్డీ పోటీలు

విశాలాంధ్ర విజయనగరం ఫోర్ట్: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జూనియర్ కబడ్డీ ఎంపికలో ఎంపికైన క్రీడాకారులు, ఈ నెల 23 నుంచి 26 వరకు ఎన్‌టీఆర్ జిల్లా గొల్లపూడిలో జరగబోయే అంతర జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో కారదర్శి కె.వి. ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపిన లక్ష్మణరావు, ట్రెజరర్ శివ, హెచ్.ఎమ్.లు నగేష్‌కుమార్, కొవ్వాడ శేఖర్, తౌడు బాబు, మీసాల శ్రీను, తిరుపతి రావు, సుధ, సౌధమణి తదితరులు పాల్గొన్నారు.

గీత కులాల అభివృద్ధికి కృషి చేయాలి

విశాలాంధ్ర విజయనగరం ఫోర్ట్: గుంటూరులో ఏపీ కల్లుగీత కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి గుంటూరు కంచర్ల కటేశ్వరరావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా చెల్లిబోయిని శ్రీనివాసరావు, అంగటి రాము, వేణుగోపాల్, పట్నాల వెంకటేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర యాత సంక్షేమ సంఘం అధ్యక్షుడు అంగటి రాము మాట్లాడుతూ, గీత సహకులందరూ ఐక్యంగా ఒకే తాటిపై నడవాలని, సొసైటీల అభివృద్ధి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా, ఇటీవలే జరిగిన ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రివర్గంలో కీలక పదవులు చేపట్టిన నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 10 శాతం బ్రాందీ షాపులలో రాయితీ కల్పించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల భద్రత రక్షణ ప్రధాన ధ్యేయం

విశాలాంధ్ర - చీపురుపల్లి: ప్రజల భద్రత రక్షణే ప్రధాన ధ్యేయంగా కృషి జరుపుతున్నామని చీపురుపల్లి ఎస్ఐ ఎల్.దామోదర్ రావు అన్నారు. సోమవారం చీపురుపల్లి పట్టణంలోని గాంధీ సెంటర్ జంక్షన్ నుండి పోలీస్ స్టేషన్ మీదుగా రైల్వే స్టేషన్ వరకు వెళ్లే రహదారిని ఎస్ఐ ఎల్ దామోదర్ రావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది రహదారికి భద్రత కల్పిస్తూ చర్యలు చేపట్టారు. ప్రధానంగా గాంధీ బొమ్మ సెంటర్ నుండి పోలీస్ స్టేషన్ మీదుగా రైల్వే స్టేషన్ వైపు వెళ్లే రహదారి గోతులమయం కావడంతో ఆ రహదారి గుండా ప్రయాణం చేయుటకు ప్రజలు పడుతున్న నానా అవస్థల గురించి పత్రికల్లో వచ్చిన కథనాలకు ఆయన స్పందించారు. ఈ మేరకు స్థానిక పంచాయతీ సహకారంతో యంత్రాలను ఏర్పాటు చేసి రహదారి మరమత్తులను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దామోదర్ రావు తో పాటు సిబ్బంది పాల్గొనని అర్వదారిని గంఢ్లు పూర్తి శుభ్రం చేశారు. పోలీస్ సిబ్బంది సహాయక కార్యక్రమం చేపట్టడం పట్ల పలువురు హర్షణీయం వ్యక్తం చేస్తున్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రమదానం

విశాలాంధ్ర విజయనగరం ఫోర్ట్: సేవా కార్యక్రమాల్లో భాగంగా శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్, అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో "శ్రమదాన " కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 42వ డివిజన్ పరిధిలో.. అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న మున్సిపల్ కార్పొరేషన్ నడక మైదానంలో నిర్వహించారు. ఇందులో భాగంగా క్లబ్ సభ్యులంతా నడక దారిలో వర్షాలకు గుంతలయ్యి నీరు నిలువ ఉన్నచోట రబిస వేసి వాకింగ్ ట్రాక్ ను సరిచేసి బాగుచేసుకున్నారు.. ఈ శ్రమాదాన కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త, మాజీ పార్లమెంట్ సభ్యులు, క్రమంతప్పకుండా నడిచే సీనియర్ నడక సభ్యులు డాక్టర్ డి.వి.జి. శంకరరావు కూడా పాల్గొని గుంతల్లో రబిసను సరిచేసి, పదిమందికి ఉపయోగపడే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తాడ్డి ఆదినారాయణను, అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు, ప్రముఖ సామాజిక వేత్త త్యాడ రామకృష్ణారావు (బాలు)ను అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ పెద్దలు జి. గోవిందరావు,వై. నల్లమరాజు, కోట్ల సత్యనారాయణ,పెనుమత్స అప్పలరాజు, కోట్ల ఈశ్వరరావు,టి. రమణ,నరేష్, కృష్ణ, ప్రసాద్ తదితర పెద్దలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర -బొబ్బిలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధి పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అదేవిధంగా ఎమ్మెల్యే బేబినాయన పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం నిధులు మంజూరు చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ శరత్ బాబు అన్నారు. అందులో భాగంగానే పురపాలక సంఘపరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.15 వ ఆర్థిక సంఘ నిధులు తో 12వ వార్డు - దమ్మా వీధి గొల్లపల్లి లో సిసి రోడ్డు నిర్మాణం చేయుట 10 లక్షల50 వేల రూపాయలు,9 వ వార్డు - దేవాంగుల వీధి యందు సి.సి రోడ్డు నిర్మాణం అంచనా వ్యయం 4 లక్షల 17 వేల రూపాయలు,11 వ వార్డు- గొల్లపల్లి యందు సిసి రోడ్డు చేయుటకు గాను అంచనా వ్యయం 3 లక్షలు తో శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్ కుమార్ , మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ వి. వి.ఎస్. ఎన్. గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

రాజాం జిసిఎస్ఆర్ కళాశాలలో బ్లడ్ గ్రూపింగ్

విశాలాంధ్ర -రాజాం: రాజాం స్థానిక జిసిఎస్ఆర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో, రెడ్ క్రాస్ సమాఖ్య సహాయ సహకారాలతో సోమవారం బ్లడ్ గ్రూపింగ్ (రక్త నమూనా) కార్యక్రమాన్ని విశాల స్థాయిలో నిర్వహించారు. విద్యార్థులలో ఆరోగ్య అవగాహన పెంచడం, భవిష్యత్తులో రక్తదానం పట్ల ఆసక్తి కలిగించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 600 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ రక్త గ్రూప్ పరీక్షలు చేయించుకున్నారు. రక్త గ్రూప్ తెలుసుకోవడం ద్వారా ఎమర్జెన్సీ పరిస్థితుల్లో తక్షణ వైద్య సహాయం పొందవచ్చని నిర్వాహకులు విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. పురుషోత్తంరావు, జిఎంఆర్‌విఎఫ్ విద్యాసంచాలకులు డాక్టర్ జి.గిరీష్, రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్, సామాజిక వేత్త కొత్త సాయి ప్రశాంత్‌కుమార్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కళాశాల అధ్యాపకులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు సక్రమ ఏర్పాట్లు చేసి విద్యార్థులకు సహకరించారు.

బాధితుల సమస్యలను చట్టపరిధిలో తక్షణమే పరిష్కరించాలి

జిల్లా అదనపు ఎస్పీ పి.సౌమ్యలత

విశాలాంధ్ర -విజయనగరం టౌన్ : జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ సిస్టం) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపిఎస్ ఆదేశాలతో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత సోమవారం నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి అదనపు ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ కార్యక్రమంలో భాగంగా అదనపు ఎస్పీ 32 ఫిర్యాదులను స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 8, కుటుంబ కలహాలకు సంబంధించినవి 5, మోసాలకు పాల్పడినట్లు 1, ఇతర అంశాలకు సంబంధించినవి 18 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవమైనట్లయితే చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, 7దినాల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను నివేదిక రూపంలో జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని సంబంధిత పోలీసు అధికారులను అదనపు ఎస్పీ పి.సౌమ్యలత ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎస్బీ సిఐలు ఎ.వి.లీలారావు, డిసిఆర్బి సిఐ బి.సుధాకర్, ఎస్ఐ రాజేష్ , సిబ్బంది పాల్గొన్నారు.

గురజాడ అప్పారావు జయంతిని రాష్ట్ర పండగలా నిర్వహించాలి

ఎమ్మెల్యే కిమిడికి పౌరవేదిక బృందం వినతి

విశాలాంధ్ర -విజయనగరం రూరల్ : ప్రజా జీవనంలో సామాజిక మార్పుకోసం తన పదునైన రచనలతో ప్రజా చైతన్యం కోసం నిరంతరం కృషి చేసిన మహా కవి గురజాడ అప్పారావు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండగలా చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి చీపురుపల్లి ఎమ్మెల్యే, మాజీమంత్రి కిమిడి కళా వెంకటరావుని కోరారు. సోమవారం పౌరవేదిక బృందం తో కలిసి చీపురుపల్లి పార్టీ కార్యాలయంలో వినతిపత్రం అందచేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రముఖుల జయంతి, వర్ధంతిలను రాష్ట్ర ప్రభుత్వం వేడుకలుగా చేసే లిస్టులో లేదని జీఓ నెంబర్ 689 తేదీ 10-4-2025 న విడుదల చేసిన ఈ జీఓలో గురజాడ అప్పారావు పేరు లేకపోవడంతో గురజాడ అభిమానులు, జిల్లా ప్రజలు ఆవేదన చెందుతున్నారని భీశెట్టి అన్నారు. సెప్టెంబర్ 21 ఆదివారం జరగనున్న గురజాడ అప్పారావు 163వ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఉత్సవంలా నిర్వహించాలన్నారు. ఈనెల17 న బుధవారం విజయనగరం లో గురజాడ అప్పారావు విగ్రహం వద్ద దీక్ష చేపడతామని ప్రకటించారు. అసెంబ్లీ సమావేశాల్లో గురజాడ జయంతి అంశాన్ని ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే కళా చెప్పారని భీశెట్టి అన్నారు. ఎమ్మెల్యే ని కలిసిన వారిలో పౌరవేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ పిడకల ప్రభాకరరావు, ఇప్పలవలస గోపి, తుమ్మగంటి రామ్మోహన్ రావు, తాత్రాజు రాజారావు,బోర రమేష్,తదితరులు పాల్గొన్నారు.

ఎం.వీ.జీ.ఆర్‌లో ఇంజనీర్స్ డే వేడుకలు

విశాలాంధ్ర - డెంకాడ: మండలంలోని చింతలవలస వద్దనున్న ఎం.వీ.జీ.ఆర్ కళాశాలలో ఇంజనీర్స్ డే సందర్భంగా ఇంజనీరింగ్ ఇన్నోవేషన్ ఫ్యూచర్ ఆఫ్ టెక్నాలజీ" అనే థీమ్తో ఇంటరాక్టివ్ స్పెషల్ గెస్ట్ లెక్చర్ను నిర్వహించారు. మైక్రోసాఫ్ట్ ప్రొడక్ట్ మేనేజర్ మనూ కపూర్ ముఖ్య అతిథిగా హాజరై ఫ్యూచర్ ఇంజనీరింగ్ ఇన్నోవేషన్కు ఉత్ప్రేరకంగా ఏఐ అనే అంశంపై ఉపన్యాసం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎం.వి.జి.ఆర్ ప్రిన్సిపాల్ డా. వై.ఎం.సి శేఖర్ ఆవిష్కరణ, సమస్య పరిష్కారానికి నివాళిగా ఇంజనీర్స్ డే యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఏఐ యుగంలో, కెరీర్ వృద్ధికి మరియు ఆవిష్కరణలకు నైపుణ్యాలు అత్యంత ముఖ్యమైనవని ఆయన చెప్పారు. ఇంజనీర్లు నిరంతరం నేర్చుకోవాలని, సాంకేతిక మార్పులకు అనుగుణంగా మారాలని మరియు దృష్టి సహానుభూతితో ముందుకు సాగాలని కోరుతూ ఒక స్ఫూర్తిదాయకమైన సందేశంతో తన ఉపన్యాసమును ముగించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ, ప్లేస్మెంట్స్ డీన్ డా. ఎం. సునీల్ ప్రకాష్, శిక్షణ ప్లేస్మెంట్ ఆఫీసర్ డా. ఎం.వి.వి భాను, స్వేచ్ఛ-ఎపి-ఎం.వి.జి.ఆర్ కోఆర్డినేటర్ శ్రీ ఎం వంశీ కృష్ణ, వివిధ విభాగాల అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజినీరింగ్ కాలేజీలో ఇంజనీర్స్ డే

విశాలాంధ్ర - గరివిడి: స్థానిక గరివిడి అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం మధ్యాహ్నం ప్రిన్సిపాల్ డాక్టర్ జె.బాల భాస్కరరావు అధ్యక్షతన ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.అనంతరం వేడుకలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్.వి.కే దుర్గాప్రసాద్ మెకానికల్ ఇంజనీర్ ఏజీఎం ఫెర్రో ఎల్లాయిస్ కార్పొరేషన్ లిమిటెడ్, గరివిడి నుండి విచ్చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంజనీర్ గా జీవితాన్ని ప్రారంభించిన సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశాభివృద్ధికి దోహదం చేసే అనేక నీటి ప్రాజెక్టులను రూపకల్పన చేశారని వివరించారు. ఈ సందర్భంగా మెకానికల్ ఇంజనీర్ ఆర్.వి.కే దుర్గాప్రసాద్‌ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్.ప్రిన్సిపాల్ బి.వెంక టరమణ, ఏఓ జి.అనిల్ కుమార్, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఎన్నికల కమిషన్ ముందు ఓట్ చోరీ నియంత్రణకు సంతకాలు సేకరణ

విశాలాంధ్ర విజయనగరం ఫోర్ట్: జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరిపి విద్యాసాగర్ (వినయ్) సోమవారం పత్రికా ప్రకటన ద్వారా దేశవ్యాప్తంగా ఓటుల హక్కుపై నమోదు అవుతున్న అనుమానాస్పద చర్యలకు నిరసనగా కేంద్ర ఎన్నికల కమిషన్‌కి ముందు సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ఉద్యమాన్ని ద్వారా ప్రజల ఓటు హక్కు కాపాడే బాధ్యత ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియాకు గుర్తుచేసే పని జరుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యాసాగర్ (వినయ్) మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఓటు హక్కును కల్పిస్తోందని, ఆ హక్కును రక్షించడం ఎన్నికల సంఘం ముఖ్య బాధ్యత అయినప్పటికీ ఈ సంవత్ లాఖలు కోసం సంఘ వ్యవస్థలు వ్యవస్థాపకంగా తప్పుడు మార్గాల్లో ఉపయోగించబడుతున్నట్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కొన్ని నియోజకవర్గాల్లో పెద్ద సంఖ్యలో కొత్త ఓట్లు అనూహ్యంగా నమోదయ్యాయని, సాయంత్రపు కొద్ది గంటలకే లక్షల సంఖ్యలో ఓట్లు వచ్చినట్లు ఆరోపించిన ప్రకటనలపై సరైన నివేదికలు, సీసీటీవీ ఫుటేజీలు వంటి ఆధారాల కోసం ఎలక్షన్ కమిషన్‌ను పిలుచుకొస్తామని చెప్పారు. ఈ చర్యలను ఓటు చోరీగా అభివర్ణిస్తూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు ం విజయనగరం జిల్లాలో గ్రామాలు, వాడవాడలు, వార్డులల్లో నేటి నుంచి అక్టోబర్ 15 వరకు సార్వత్రికంగా సంతకాల సేకరణ జరపబోతున్నట్టు మరిపి విద్యాసాగర్ వెల్లడించారు. మొత్తం ఉద్యమాన్ని నియోజకవర్గ సమన్వయకర్తలు, వివిధ సెల్ చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో నిర్వహిస్తామని చెప్పారు. మరిపి విద్యాసాగర్ పిలుపు: "ప్రజల ఓటు హక్కు కాపాడటంలో మీ ఒక్క ఒక్క సంతకం కూడా కీలకం ం అందరూ ముందుకు రావాలి, ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు ఒకటై పోరాడుదాం" అని ఆయన విజయనగరం జిల్లాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు, సమన్వయ సమాచారానికి జిల్లా కాంగ్రెస్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ప్రకటనలో పేర్కొన్నారు.

రాజయ్యపేట సచివాలయాన్ని ఎంపీడీవో సందర్శన

విశాలాంధ్ర -రాజాం: రాజాం మండల పరిధిలోని రాజయ్యపేట గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు సందర్శించారు. సచివాలయంలో సిబ్బంది హాజరు, ప్రజా సేవల అమలు, పెండింగ్ పనుల పురోగతిపై ఆయన సమీక్ష జరిపారు. ప్రజలకు మరింత సమయానుకూలంగా, పారదర్శకంగా సేవలు అందించాలంటూ సిబ్బందికి సూచనలు చేశారు.

మెట్టపల్లిలో ఘనంగా హిందీ దివస్

విశాలాంధ్ర - చీపురుపల్లి: చీపురుపల్లి మండలం మెట్టపల్లి గ్రామంలోని పాఠశాలలో హిందీ దివస్ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఉప విద్యాశాఖ అధికారి విజయ్ కుమార్, పాఠశాల హిందీఉపాధ్యాయులు ఎస్ భవాని, జి జ్యోతి పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

విశాలాంధ్ర - డెంకాడ: మండల కేంద్రంలోని అక్కివరం పశు వైద్యశాల వైద్యాధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా డెంకాడ మండలం అక్కివరం గ్రామంలో గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మండల పరిషత్ అధ్యక్షులు బంటుపల్లి వాసుదేవరావు, స్థానిక మండల ప్రాదేశిక సభ్యులు కంది చంద్రశేఖర్, స్థానిక సర్పంచ్ కంది కిరణ్ కుమార్ సోమవారం అక్కివరం గ్రామంలో ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో 225 పాడి పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు అక్కివరం గ్రామంలో, 400 పాడి పశువులకు వేదుళ్ళవలస, రఘు మండ గ్రామాల్లో, 300 పాడి పశువులకు పిన తాడివాడ గ్రామంలో వేశారు. వెటర్నరీ డాక్టర్ తెలియజేశారు.

మద్యంతో పట్టుబడిన ద్విచక్ర వాహనం వేలం

విశాలాంధ్ర -లక్కవరపుకోట: మద్యంతో పట్టుబడిన ద్విచక్ర వాహనం వేలం వెయ్యబడుతుందని ఎస్ఐ సిహెచ్ నవీన్ పడాల్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 22 .12. 2024 వ సంవత్సరంలో AP 35 M 7699 నంబర్ గల టీవీఎస్ ఎక్సెల్ స్కూటీ లో అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్న కేసులో ముద్దాయిని పట్టుకోవడం జరిగింది. అదే కేసులో అతను మద్యం ఎక్సెల్ బండి మీద తీసుకొని వెళుతుండగా పట్టుకోవడంతో ఆ వాహనంను సీజ్ చేయడం జరిగింది. దీనికి గాను డిప్యూటీ కమిషనర్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్ వారు ఆ యొక్క వాహనమును వేలం వేయుటకుగాను ఉత్తర్వులు ఇవ్వటం జరిగింది. అందువల్ల బుధవారం లక్కవరపు కోట తహసీల్దార్ ఆఫీసులో వేలం పాట కార్యక్రమం జరుగును కావున ఆసక్తి గలవారు ఈ వేలంపాటలో పాల్గొనగలరని ఎస్సై తెలియజేశారు.

పద్మశాలీలు అన్నిరంగాల్లో రాణించాలి

విశాలాంధ్ర- గరివిడి పద్మశాలీలు అన్నిరంగాల్లో రాణించాలని మాజీ ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవులు అన్నారు. గరివిడి పట్టణంలో పద్మశాలీ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ రాష్ట్ర ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవులు మాట్లాడారు. పద్మశాలీ సామాజిక వర్గీయులు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనుకబడినప్పటికీ ఐక్యతతో ముందుకు సాగితే అన్ని రంగాల్లో రాణించవచ్చు అని, విద్యలో పురోగమించి సమాజ సేవలో చురుకుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గరివిడి గ్రామానికి చెందిన కాన్సర్ బాధితుడు దొడ్డి వెంకట రమణ కు పద్మశాలీ యువజన సంఘం తరఫున రూ.66 వేల ఆర్థిక సహాయం అందించారు. సమావేశంలో మాజీ సింహాచలం బోర్డు సభ్యులు సూరిశెట్టి సూరిబాబు, జిల్లా పద్మశాలీ సంఘ అధ్యక్షుడు వంక ఉదయ్ కుమార్, సంఘ ప్రతినిధులు బడిగంటి సీతారాం, బడిగంటి బంగార్రాజు, కల్లూరి సీతా శ్రీరాములు, బట్టా జగదీష్, సీరపు శ్రీను, కాదూరి రామారావు, తీడ రమణ తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు 162 వినతులు: డి.ఆర్.ఓ

విశాలాంధ్ర విజయనగరం టౌన్: ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాల్సిన భాద్యత జిల్లా అధికారులదేనని డి ఆర్ ఓ ఎస్.శ్రీనివాస మూర్తి స్పష్టం చేశారు. కేసులను పరిష్కారించే ముందు నోటీసులు జారీచేసి విచారించాలని, రికార్డ్ చేయాలని ఆదేశించారు. ఫిర్యాదులు రీ ఓపెన్ కాకుండా చూడాలని అన్నారు. గడువులోగా వినతులకు పరిష్కారం చూపని యెడల, సంబందిత అధికారి పై చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన పిజిఆర్ఎస్ లో జిల్లారెవిన్యూ అధికారి శ్రీనివాసమూర్తి ప్రజల నుండి వినతుల స్వీకరించారు. పిజిఆర్ఎస్ కు మొత్తం 162 వినతులు అందాయి. వినతుల స్వీకరణ కార్యక్రమంలో డి ఆర్ ఓ తో పాటు డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర రావు, ప్రమీలా గాంధీ పాల్గొన్నారు. అధికంగా రెవిన్యూ శాఖకు సంబంధించి 64, డి ఆర్ డి ఏ కు 47, పంచాయతీ శాఖకు 7, పురపాలక సంఘాలకు 6, ఇతర శాఖలకు సంబంధించి 38 వినతులు స్వీకరించారు.

యూరియా సరఫరాను పరిశీలించిన తహసీల్దార్

విశాలాంధ్ర - కొత్తవలస : కొత్తవలస మండలంలోని గనిశెట్టిపాలెం, వీరభద్రపురం, కొత్తవలస తదితర రైతు సేవా కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న యూరియా సరఫరా తీరును కొత్తవలస తహసీల్దార్ పి.అప్పలరాజు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా యూరియా పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కొత్తవలస మండలంలో సరిపడా యూరియా ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని వివరించారు. ఉన్నతధికారుల ఆదేశాలు, నిబంధనల మేరకు దపదపాలుగా ఎరువులు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. పంపిణీను ఏడీఏ బానులత , మండల వ్యవసాయ అధికారి కే.వి.రామ్ ప్రసాద్, రెవెన్యూ అధికారులు పర్యవేక్షించారు.

విశాలాంధ్ర

పేజి 3

విజయనగరం

మంగళవారం 16, సెప్టెంబర్ 2025

బానాదిలో ప్రారంభమైన పారిశుద్ధ్య పనులు

విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని బానాది గ్రామంలో ఎట్టకేలకు పారిశుద్ధ్య పనులు ప్రారంభమయ్యాయి. విశాలాంధ్ర దినపత్రికలో అభివృద్ధికి ఆమడ దూరంలో బానాది, పేరుకు పోయిన చెత్త చెదారం, కంపు కొడుతున్న బానాది గ్రామం అనే శీర్షిక వచ్చిన కథనానికి స్పందించిన పంచాయతీ విస్తరణాధికారి రవికుమార్. సోమవారం పారిశుద్ధ్య పనులను చేపట్టారు. ఈ మేరకు ఎస్సీ కాలనీలో గల చెత్త చెదారాలను పారిశుద్ధ్య కార్మికులచే డంపింగ్ యార్డుకు తరలించారు. అలాగే గ్రామాల్లో ప్రధాన రహదారికి అనుకొని ఉన్న చెత్తను కూడా తరలించారు. అలాగే గ్రామం చుట్టూ ఉన్న చెత్తాచెదారాలతో పాటు కాలువల్లో గల పూడికను తీయించడం జరుగుతుందని ఇఓపిఆర్డి రవికుమార్ తెలిపారు. ఈ మేరకు పారిశుద్ధ్య పనులు ప్రారంభం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మూర్తి స్వచ్ఛభారత్ కార్మికులు పాల్గొని పనులను చేపట్టారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలి

జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎ.ఆర్.దామోదర్, ఐపిఎస్ జిల్లాలో పని చేస్తున్న పోలీసు అధికారులతో జిల్లా పోలీసు కార్యాలయంలో సమావేశమై, ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలను వివరించి, నిర్వహించాల్సిన విధుల గురించి అధికారులకు దిశా నిర్దేశం చేసారు. జిల్లాలో పని చేస్తున్న పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ మమేకమై, ఆయా సబ్ డివిజన్ల పరిధిలోని ప్రధాన నేరాలు, శాంతిభద్రతల సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపిఎస్ మాట్లాడుతూ - రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన అంశాలకు ప్రాధాన్యత కల్పించాలని, అసాంఘిక శక్తులను అణిచి వేసేందుకు కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఒడిస్సా రాష్ట్రంకు సరిహద్దుగా జిల్లా ఉండడం వలన గంజాయి అక్రమ రవాణ జరిగేందుకు అవకాశం ఉన్నందున వాటిని పూర్తిగా నియంత్రించి, గంజాయి అన్న పదం జిల్లాలో వినిపించకుండా చేయాలన్న ధృఢ సంకల్పంతో అధికారులు పని చేయాలన్నారు. మహిళలు, బాలల భద్రతకు రక్షణ కల్పించేందుకు అధిక ప్రాధాన్యత కల్పించాలన్నారు. మహిళలు చేస్తున్న ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. మహిళలు, బాలల భద్రతను దృష్టిలో పెట్టుకొని క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. బాలలపై లైంగిక దాడులు జరగకుండా గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పట్ల అవగాహన కల్పించేందుకు ఎం.ఎస్.పి.లను క్షేత్ర స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. మహిళల రక్షణకు ప్రభుత్వం రూపొందించిన శక్తి (ఎస్.ఓ.ఎస్) యాప్ పట్ల, యాప్ను వినియోగించి పోలీసుల సహాయంను ఏవిధంగా పొందవచ్చునో మహిళలకు అవగాహన కల్పించే విధంగా శక్తి బృందాలు పని చేయాలన్నారు. సైబరు నేరాల నియంత్రణకు ప్రజల్లో అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యంగా పని చేయాలన్నారు. ఇటీవల కాలంలో జరుగుతున్న సైబరు మోసాలు, నేరాల తీరును ప్రజల్లోకి తీసుకొని వెళ్ళాలని, ఇందుకు ప్రత్యేకంగా వీడియోలను రూపొందించి, సోషల్ మీడియా ద్వారా ప్రచారం కల్పించి, వాటిని ప్రజలకు చేరువ చేస్తామన్నారు. త్వరలో వివిధ పోలీసు స్టేషనుల్లో నమోదై, దర్యాప్తులో ఉన్న కేసులను సమీక్షించి, నేరాల నియంత్రణకు లక్ష్యాలను నిర్దేశిస్తామని తెలిపారు. జిల్లాలో ట్రాఫిక్ రెగ్యులేషనుకు చర్యలు చేపడతామని, ఎం. వి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎన్ఫోర్సుమెంటు కేసులు నమోదు చేయాలని, ఈ-చలానాలను వాహనదారులు వెంటనే చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పోలీసు విధులను నిర్వహించడంలో టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డ్రోన్స్, సిసి కెమెరాలను వినియోగించి నేరాల నియంత్రణ, ఛేధనకు చర్యలు చేపట్టాలన్నారు. పోలీసు సేవలను ప్రజలకు మరింత మెరుగ్గా, సమర్ధవంతంగా అందించేందుకు సంబంధిత పోలీసు అధికారులు, సిబ్బంది మానవత్వంతో వ్యవహరించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలను, శక్తులను అణిచి వేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేసారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ పి. సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ జి. నాగేశ్వరరావు, విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డిఎస్పీ జి.భవ్య రెడ్డి, చీపురుపల్లి డిఎస్పీ ఎస్.రాఘవులు, డిటిసి డిఎస్పీ ఎం.వీర కుమార్, మహిళా పిఎస్ డిఎస్పీ ఆర్.గోవిందరావు, పలువురు సిఐలు, ఆరఐలు పాల్గొన్నారు.

మున్సిపల్ గ్రీవెన్స్ కు రెండు వినతులు

విశాలాంధ్ర-విజయనగరం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి పలువురు నుండి రెండు వినతులు వచ్చాయి. సోమవారం విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కమిషనర్ పల్లి నల్లనయ్య ఈ మేరకు వినతులను స్వీకరించారు. ఇంజనీరింగ్, ప్రణాళిక విభాగాలకు ఒక్కొక్క వినతి పత్రం అందాయి. ఆయా వినతులను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత విభాగాధిపతులకు కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, రమణమూర్తి పాల్గొన్నారు.

సేవా పక్వాడ్ పక్షోత్సవాలు నిర్వహించాలి

విశాలాంధ్ర-గజపతినగరం : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం పురస్కరించుకొని ఈనెల 17వ తేదీ నుండి నిర్వహించనున్న సేవా పక్వాడ్ పక్షోత్సవాలు పకడ్బందీగా జరపాలని బిజెపి జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసరావు అన్నారు. సోమవారం గజపతినగరం నియోజకవర్గంలో ని పురిటిపెంట న్యూ కాలనీలో గల దేవుడు బాబు ఇంటివద్ద మండల పార్టీ అధ్యక్షులు ఎం భాస్కరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు పాగిరి గౌరీ, వి సత్యనారాయణ, తౌడు, ఉదయ్, పాపి నాయుడు, తవిటి నాయుడు, మహేష్, గోపి, ప్రకాష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీతంలో 58వ ఇంజనీర్ల దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ స్థానిక గాజులరేగ పరిధి లో గల సీతం కళాశాలలో 58వ ఇంజనీర్ల దినోత్సవంసోమవారం నిర్వహించారు. భారత రత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య కు నివాళులర్పిస్తూ డీప్ టెక్ %ఆ% ఇంజనీరింగ్ ఎక్సలెన్స్ %-% డ్రైవింగ్ ఇండియాస్ టెకేడ్ అనే థీమ్ తో ఈ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జలవనరుల శాఖ విశ్రాంత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డాక్టర్ కె. రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. సుస్థిర ఇంజనీరింగ్ ఆధారాలు పై ఆయన చేసిన ప్రసంగం విద్యార్థులు విశేషంగా ఆకర్షించింది. ఇందులో భాగంగా సుస్థిర అభివృద్ధి కొరకు అధిక నాణ్యత, అధిక పరిమాణం కలిగిన ఫ్లై యాష్ కాంక్రీట్ లో పై ప్రదర్శన తో గ్రీన్ టెక్నాలజీ మరియు సుస్థిర అభివృద్ధి యొక్క ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి. రవికిశోర్ మాట్లాడుతూ వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంలో ఇంజనీర్ల బాధ్యతలు, పాత్రలపై ఆయన విద్యార్థులకు స్పష్టతనిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. వి. రామమూర్తి విద్యార్థులను సృజనాత్మకత, ఆత్మవిశ్వాసంతో ఇంజనీరింగ్ సవాళ్లను ఎదుర్కోవాలని పేర్కొన్నారు. సత్య విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు సర్ విశ్వేశ్వరయ్య వారసత్వాన్ని స్మరించుకొని, విద్యార్థుల్లో క్రమశిక్షణ, అంకితభావం, కొత్త ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రాజెక్ట్ ఎక్స్పో లో వివిధ విభాగాల విద్యార్థులు ప్రాజెక్టులు, వర్కింగ్ మోడల్స్ ను ప్రదర్శించారు. ఉత్తమ ప్రాజెక్టులను రూపొందించిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసింది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సి.హెచ్. వెంకటలక్ష్మి వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రసా బసాగా మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-గజపతినగరం: గజపతినగరం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ బెల్లాన జ్ఞాన దీపిక అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సురేష్ బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ యూరియా కొరతకు కారణం ప్రభుత్వ వైఫల్యం అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని అన్నారు. అలాగే వివిధ శాఖలకు చెందిన అధికారులు మాట్లాడుతూ తాసిల్దార్ రత్నకుమార్ భూములు రీ సర్వేపై మధు పాడ సర్పంచ్ కే . పైడపునాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే కె ఎస్ ఆర్ పురం సర్పంచ్ నాయుడు గ్రామంలో వ్యవసాయ అధికారి యూరియా ఒక ప్రైవేటు మిల్లులో ఉంచి పంచి పెట్టడం ఎంతవరకు సబబు అని సర్పంచ్ తెలియకుండా ఉండడం విడ్డూరం అని ధ్వజమెత్తారు. అలాగే అన్ని శాఖ అధికారులు తమ ప్రగతిని వివరించారు ఈ సమావేశంలో గజపతినగరం ఏఎంసి చైర్మన్ గోపాల రాజు ఇంచార్జ్ ఎంపీడీఓ పుష్పలత, జడ్పిటిసి గార తౌడు, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షాన వై.యస్. ఆర్. కాంగ్రెస్ పార్టీ

విశాలాంధ్ర-చీపురుపల్లి : ప్రజల కష్టసుఖాలు పాలుపంచుకుంటూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసం నిత్యం కృషి చేస్తుందని ఆ పార్టీ నాయకులు జిల్లా ప్రచార అధ్యక్షులు వలి రెడ్డి శ్రీనివాస నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు మీసాల వరాల నాయుడు తదితరులు అన్నారు. సోమవారం నాడు చీపురుపల్లి పంచాయితీ జి అగ్రహారం సమీపంలో ముత్యాలమ్మ తల్లి కోవెల పక్కన నిర్మాణంలో నిలిచిపోయిన అయ్యప్ప స్వామి సన్నిధానం నిర్మాణ పనులను స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. సన్నిధానం పనులు పూర్తి కాకపోవడం వలన అయ్యప్ప స్వామి భక్తులు ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న సన్నిధానం నిర్మాణానికి సహకారం అందిస్తామని తమ వంతు సహకారం అందజేస్తామని ఈ సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆశ్రయించి ఇనాం భూముల పేరుతో తాము సాగు చేసుకుంటున్న భూములకు ప్రభుత్వం కనీస భరోసా కల్పించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా నాయకుల ద్వారా రైతులు కోరారు. ఈ కార్యక్రమంలోస్థానిక సర్పంచ్ మంగళగిరి సుధారాణి శ్రీనివాస్, వైస్సార్ పార్టీ నాయకులు కర్రోతు రమణ, ఎంపిటీసీ కోనిరెడ్డి రమణ, కోరుకొండ దాలయ్య, గవిడి సురేష్, కర్రోతు ప్రసాద్ వార్డ్ మెంబర్స్ రౌతు పైడిరాజు, బూరాడ మహేష్, తలచుట్ల రాము, మజ్జి శంకర్, కంపపల్లి అశోక్, పతివాడ అఖిల్, దబ్బాడ ఆనంద్, రెడ్డి సురేష్, ప్రభాత్, పిల్ల అప్పలరాజు, చిరంజీవి, రాంప్రసాద్, చిన్నబాల గ్రామ పెద్దలు, యువకులు, రైతులు, పాల్గొన్నారు.

లెండి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఘనంగా ఇంజనీర్ల దినోత్సవం

విశాలాంధ్ర-డెంకాడ: లెండి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (ఎల్ఐఈటి) లో ఇంజనీర్ల దినోత్సవం సోమవారం ఘనంగా, ఉత్సాహంగా జరుపుకున్నారు. సమాజ అభివృద్ధి మరియు సాంకేతిక ప్రగతికి ఇంజనీర్ల చేసిన కృషిని గుర్తిస్తూ ఈ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డా. వి.వి. రామా రెడ్డి అధ్యక్షత వహించారు. ఇంజనీర్ల సృజనాత్మకతతో ముందుకు వచ్చి ప్రస్తుత సాంకేతికతను సమాజ అవసరాలతో సమన్వయం చేస్తూ ప్రపంచానికి ఉపయోగపడాలని ఆయన పిలుపునిచ్చారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైమ్ అండ్ షిప్ బిల్డింగ్ (సి ఈ ఎం ఎస్), విశాఖపట్నం జనరల్ మేనేజర్ సబాసాచి ముఖర్జీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, యువ ఇంజనీర్ల సృజనాత్మకతను ప్రశంసిస్తూ, భారతదేశం కొత్త సాంకేతికతలను ఆహ్వానిస్తూ ఉత్సాహభరితమైన దశలో ముందుకు సాగుతోంది అని అన్నారు. లెండి ఇన్స్టిట్యూట్ కార్యదర్శి మరియు ప్రతినిధి కె. శివరామ కృష్ణ అన్ని అభివృద్ధి చెందుతున్న ఇంజనీర్లకు శుభాకాంక్షలు తెలుపుతూ, వారి సామర్థ్యాలను పెంపొందించుకునే పరిశ్రమలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ (ఐ ఈ) సమన్వయకర్త డా. శ్రీధర్ మాట్లాడుతూ, నైపుణ్యంతో పాటు సరైన వైఖరి కలిగిన వారే అగ్రగాములు అవుతారని, విద్యార్థులు ఎల్లప్పుడూ ఉన్నతత సాధించడానికి కృషి చేయాలని ప్రోత్సహించారు. ఈ వేడుకల్లో భాగంగా ప్రాజెక్ట్ ఎక్స్పోను నిర్వహించారు, ఇందులో విద్యార్థులు తమ ప్రతిభను వివిధ నమూనాలు, ప్రోటోటైప్ ద్వారా ప్రదర్శించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు మరియు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ డా. హరిబాబు తమ్మినేని, డా. అంజి రెడ్డి, విభాగాధిపతులు డా. రామారావు, డా. సతీష్ పుజారి, డా. సుబ్బరామయ్య, డా. ప్రసాద్, డా. రాజేందర్, వర్మ మరియు డీన్లు వసంత్, ప్రకాష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ వేడుక యువ ఇంజనీర్లలో సృజనాత్మకతను ప్రేరేపిస్తూ, సాంకేతికంగా శక్తివంతమైన మరియు సుస్థిరమైన భవిష్యత్తును నిర్మించడానికి దారితీసే వేదికగా నిలిచింది. ..

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి..

విశాలాంధ్ర-చీపురుపల్లి : పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను ప్రతి ఒక్క పాడి రైతు సద్వినియోగం చేసుకోవాలని చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకట్రావు అన్నారు. జాతీయ పశు వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం నాడు చీపురుపల్లి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నెల రోజులు పాటు నిర్వహించనున్న పశువైద్య శిబిరాల గోడ పత్రికను కళా వెంకట్రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుండి వచ్చే నెల 15 వరకు గ్రామాల వారీగా నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను ప్రతి ఒక్క పాడి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాలుగు నెలల వయసు నుండి అన్ని పశువులకు గాలికుంటు వ్యాధులు రాకుండా ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత టీకాలను పొందాలని ఆయన కోరారు. చీపురుపల్లి నియోజకవర్గం పరిధిలో 50వేల 500 పశువులకు ప్రభుత్వ సహకారంతో టీకాలను అందజేస్తున్నామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు పశువైద్యాధికారి సిహెచ్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అవంతిలో ఘనంగా ఇంజనీర్స్ డే

విశాలాంధ్ర-భోగాపురం : మండలంలో కవులు వాడ అవంతి రీసెర్చ్ అండ్ టెక్నాలజికల్ అకాడమీలో ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేఎన్టీయూ జీవీ విజయనగరం ట్రిబుల్ ఈ విభాగాధిపతి డాక్టర్ వి.జి.ఎస్. వకుల హాజరయ్యారు. మొదటగా భారత రత్న, ఇంజనీర్ డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు. డాక్టర్ వి.జి.ఎస్. వకుల మాట్లాడుతూ "ఇంజనీర్స్ డే కేవలం విశ్వేశ్వరయ్య జయంతి గుర్తు చేసుకోవడమే కాకుండా ఆయన చూపిన క్రమశిక్షణ, ఆవిష్కరణలపై దృష్టి, సమాజ సేవ పట్ల నిబద్ధతను అనుసరించడానికి జరుపుకుంటాం. వరద నియంత్రణ, నీటి పారుదల, మౌలిక వసతుల అభివృద్ధిలో ఆయన కృషి చిరస్మరణీయం" అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి గోవిందరావు మాట్లాడుతూ "వంతెనలు, ఆకాశహర్మ్యాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, దైనందిన జీవిత సౌకర్యాల వరకు ఇంజనీర్లు సమాజ పురోగతికి కీలకంగా నిలుస్తున్నారు" అని తెలిపారు. కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్, క్వాంటం కంప్యూటింగ్, పర్యావరణ అనుకూల ఆవిష్కరణల వంటి రంగాల్లో విద్యార్థులు ముందడుగు వేసి దేశాన్ని ప్రపంచ టెక్నాలజీ నాయకత్వం వైపు నడిపించాలని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్ రావు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రతినిధి మొత్తం శెట్టి మహేష్, ఏవో జి. అశోక్ కుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఏ. వాసుదేవరావు, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీపై తహసీల్దార్ పర్యవేక్షణ

విశాలాంధ్ర-రేగిడి : రైతులకు అవసరమైన ఎరువులు సమయానికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ శ్రీమతి కృష్ణలత తెలిపారు. సోమవారం ఆమె లింగాలవలస, నాయురాలవలస, సరసనాపల్లి సచివాలయాలను సందర్శించి యూరియా పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి ఎరువులు అందుతున్న విధానం గురించి తెలుసుకున్నారు. సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు, సచివాలయ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సమయానికి యూరియా అందిస్తున్నదని ఆమె పేర్కొన్నారు.

జె ఎన్ టి యు సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే వేడుకలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జెఎన్టీయు సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంచార్జ్ వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి విచ్చేశారు ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి జయసుమ అధ్యక్షత వహించారు. కన్వీనర్ గా ఇన్చార్జి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఆర్ రాజేశ్వరరావు, కో కన్వీనర్ గా వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.జె నాగరాజు వ్యవహరించారు గౌరవ అతిథిగా విచ్చేసిన రిటైర్డ్ ఆర్ డబ్ల్యు ఎస్, ఎస్ ఈ బి ఉమాశంకర్ విద్యార్థులతో తన అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన వక్తలు భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను స్మరించుకుంటూ, దేశ నిర్మాణం, సాంకేతిక ఆవిష్కరణలలో ఆయన చేసిన కృషిని వివరించారు. యువ ఇంజనీర్లు ఆయన స్ఫూర్తిని అనుసరించి కృషి, క్రమశిక్షణ, నైపుణ్యంతో సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది డాక్టర్ జి అప్పలనాయుడు, డి జగన్నాథమ్, ఎం అజయ్, వి మీనా విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సుపధ ప్రతిభ పరీక్షల్లో చత్తా చాటిన ఆదర్శ విద్యార్థులు

పాఠశాల ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు

విశాలాంధ్ర-వేపాడ: లక్కవరపు కోటలో ఈ నెల 13న నిర్వహించిన సుపధ ప్రతిభ పరీక్షల్లో బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పాఠశాల గౌరవాన్ని పెంచారని పాఠశాల ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు తెలిపారు. సుపధ 22వ వార్షికోత్సవం సందర్భంగా సుపధ వ్యవస్థాపకులు యు.వి.ఎస్.రాజు అధ్యక్షతన, మండల విద్యాశాఖ అధికారి సిహెచ్. కుర్మారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. విద్యార్థుల్లో మానవీయ విలువలు పెంపొందించడం, మాతృభాష పరిరక్షణ ప్రధాన లక్ష్యాలుగా ఈ కార్యక్రమం నిర్వహించగా, లక్కవరపుకోట, వేపాడ, కొత్తవలస మండలాలకు చెందిన 29 పాఠశాలల నుండి మొత్తం 570 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వేపాడ శివారు చెందిన బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాల నుండి 60 మంది విద్యార్థులు హాజరై పద్యపఠనం, శ్లోకపఠనం, వ్యాసరచన, దేశభక్తి గీతాలు, శ్రీకృష్ణ చరితామృతం, ప్రహేళిక, రామాయణ తదితర పోటీలలో తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీలలో ఆదర్శ పాఠశాలకు చెందిన 17 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచి బహుమతులు అందుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు ఎం. వరలక్ష్మి, సిహెచ్. భాగ్యలక్ష్మి, యు.రమణమూర్తి సహా పాఠశాల సిబ్బంది అభినందించారని ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు తెలిపారు.

మహిళల ఆరోగ్య సాధికారత కోసం అవగాహన

విశాలాంధ్ర-మెంటాడ : మెంటాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈరోజు "స్వస్థనారి సశక్త పరివార్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ లోకప్రియ, డాక్టర్ జి.. కల్పన ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సమన్వయంతో నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు ఎదుర్కొంటున్న సాధారణ వ్యాధులు, వాటి నివారణ, ఆరోగ్య సంరక్షణ పద్ధతులపై సుదీర్ఘ చర్చ జరిగింది. డాక్టర్ లోకప్రియ మాట్లాడుతూ - "మహిళ ఆరోగ్యం బలోపేతం కావడం ద్వారా కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుంది. ఈ క్రమంలో ప్రతి మహిళ తన ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవడం, సకాలంలో పరీక్షలు చేయించుకోవడం అత్యవసరం" అని పేర్కొన్నారు. డాక్టర్ జి.. కల్పన మాట్లాడుతూ - "సమాజంలో మహిళలు సాధికారత సాధించేందుకు శారీరకంగా, మానసికంగా బలంగా ఉండటం తప్పనిసరి. అందుకోసం ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు తరచూ నిర్వహించడం జరుగుతోంది" అని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక ఆరోగ్య అవగాహన %-% పరీక్షల శ్రేణి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైద్యులు వెల్లడించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పై శిక్షణ

విశాలాంధ్ర-కొత్తవలస : చియ్యంపేట పి.హెచ్.సి లో వైద్యాధికారి డాక్టర్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంపై సూపర్ వైజర్స్ కి, ఎం.ఎల్.హెచ్.పి లకు, ఏ.ఎన్.ఎం లకు, ఆశ వర్కర్స్ కి సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వ తేదీ వరకు 11 సంవత్సరాల పైబడిన మహిళాలందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్, గర్భిణీ స్త్రీలకు బీపీ, హెచ్. బి, షుగర్, వెయిట్, బీర్. ఏ. ఐ. పరీక్షలు, అనీమియా స్క్రీనింగ్, ఇమ్యూనైజేషన్, న్యూట్రిషన్, పర్సనల్ హైజీన్, ఎన్.సి.డి.సి.డి స్క్రీనింగ్, అభ ఐడి రిజిస్ట్రేషన్, పి. ఎం. జే. ఎ. వై రిజిస్ట్రేషన్, అంగన్వాడీ పిల్లలు కి SAM,MAM, స్క్రీనింగ్ స్కిన్, డెంటల్, టీబీ, ప్రెసంప్టివ్ ట్రీట్మెంట్, ఏజ్ ఎట్ మ్యారేజ్ పై మెడికల్ క్యాంప్స్, అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈ.ఓ నరసింహారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయవద్దు...

విశాలాంధ్ర-తెర్లాం: మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో సోమవారం ఐసిడిఎస్ , ఐ. సి. డి. సి, సూపర్ వైజర్ ఈశ్వరమ్మ చైల్డ్ మ్యారేజ్ గురించి మాట్లాడుతూ, అమ్మాయిలు కు 18 ఇయర్స్ నిండాలని అబ్బాయిలు కు 21ఇయర్స్ నిండాలని సూచించారు. ఎవరు అయినా ఆ పద్ధతను పాటించక పోతే కటిన చర్యలు తప్పవని తెలిపారు. మీకు ఈ విషయాలు తెలిస్తే (1098) కి కాల్ చెయ్యండి అని సూపర్ వైజర్ ఈశ్వరమ్మ తెలియ జేశారు, ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిహెచ్ తిరుపతిరావు, ఎన్ ఎస్ ఎస్ పి . ఓ టి. రామ రావు, తెర్లాం అంగన్వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ లేజర్ రన్‌లో రావాడ విద్యార్ధి ప్రతిభ

విశాలాంధ్ర-భోగాపురం : మండలం రావాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అవనాపు భీష్మ జాతీయ వేదికపై తన ప్రతిభను చాటాడు. సెప్టెంబర్ 4 నుండి 7వ తేదీ వరకు బీహార్ రాష్ట్రం బిగుసారాయిలో జరిగిన తొమ్మిదవ జాతీయ మోడర్న్ పెంటాథ్లాన్ లేజర్ రన్ పోటీల్లో పదో తరగతి విద్యార్థి భీష్మ కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.ఎ. సూర్యనారాయణ మాట్లాడుతూ, "భీష్మ తన కృషి, క్రమశిక్షణ, క్రీడల పట్ల చూపిన ఆసక్తి వలననే ఈ విజయాన్ని సాధించగలిగాడు. దీనిలో వ్యాయామ ఉపాధ్యాయుడు సర్విరెడ్డి సూర్యనారాయణ మార్గదర్శకత్వం కీలక పాత్ర పోషించింది" అని తెలిపారు. ఈ విజయం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా దేశ స్థాయిలో ప్రతిభ కనబరచగలరని నిరూపించింది.

సమస్యలు పరిష్కారంకాని సమావేశాలు ఎందుకు?

సర్వసభ్య సమావేశంలో అధికారులను ప్రశ్నించిన సర్పంచులు

విశాలాంధ్ర-రామభద్రపురం : సమస్యలు పరిష్కారం కాని సర్వసభ్య సమావేశాలు ఎందుకని ప్రభుత్వాధికారులను మిర్తి వలస సర్పంచ్ మజ్జి రాంబాబు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారంఎంపీపీ లక్ష్మణరావుఅధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో అధికారులను ప్రశ్నించారు. పండించే పంటలకు ప్రభుత్వము రైతులకు యూరియా సక్రమంగా సరఫరా చేయకపోతే పంటలు ఎలాగ పండిస్తారని అన్నారు. ఈ విషయంపై వ్యవసాయ అధికారి శివ స్పందిస్తూ యూరియా వాడకం వలన భూమి సారవంతం తగ్గిపోయి పంట దిగుబడి తగ్గిపోతుందని యూరియాకు బదులు నానో యూరియా వినియోగించుకోవాలని సూచించారు. రామభద్రపురం ఎంపీటీసీ చంద్ర మాట్లాడుతూ బైపాస్ రోడ్డు బైపాస్ జంక్షన్ నుంచి చందానివిడి జంక్షన్ వచ్చేవరకు రోడ్డుకు ఇరువైపులా ఒక్క లైట్ కూడా లేదని దానివలన రాత్రి వేళల్లో పాదచారులు రోడ్డుపై నడిచేటప్పుడు చీకట్లో నడవడం వలన ఇటీవల వాళ్ళు ప్రమాదాలు సంభవించడం జరిగిందని పంచాయతీ విస్తరణ అధికారి వెంకటరమణకు సమస్యను మొర పెట్టుకున్నారు. ఈ సమస్య పైన స్పందిస్తూ పరిశీలన జరిపి లైట్లు వేయడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆర్ అండ్ బి ఎ ఇ ప్రణయ్ మాట్లాడుతూ బాడగి నుంచి బొబ్బిలి వెళ్లే రహదారికి నాలుగున్నర కోట్లు టెండర్లు పిలవడం జరిగిందని అన్నారు. టెండర్లు పూర్తయిన వెంటనే ఎక్కడైతే రహదారి పూర్తిగా దెబ్బతిన్నదో ఆ ప్రాంతంలో రోడ్డు వేయడానికి సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. ఈ సమావేశానికి మండల్ డెవలప్మెంట్ అధికారి రత్నం, తాసిల్దార్ ఆజా జాన్ రాఫ్, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తాసిల్దార్ హేమంత్ కుమార్ గ్రామాల్లో పర్యటన



విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో రైతు సేవా కేంద్రాల ద్వారా వలు గ్రామపంచాయతీలో తాసిల్దార్ హేమంత్ కుమార్ గ్రామాల్లో పర్యటించి రైతులకు ఎరువులు 12 పంపిణీ పూర్తయింది. సుందరడ 8 మెట్రిక్ టన్నులు పూర్తయింది. మిగిలిన 4 మెట్రిక్ టన్నులు న.బుర్జవలస గ్రామానికి పంపిణీ చేయడమైనది (సుందరద అమిటి 10 మెట్రిక్ టన్నులు రేపు పంపిణీ చేయబడతాయి. మనా గ్రోమోర్ సెంటర్ తెర్లాం 12 మెట్రిక్ టన్నులు అందాయి, ఇవి రేపు అవసరమైన రైతులకు ఎరువులు చేయబడుతాయి సర్ పంపిణీ కార్యక్రమం నిర్వహించామని ఒక ప్రకటనలో విలేకరులతో తెలిపారు.

ఉద్యోగుల కష్టాలలో పాలుపంచుకోవడం ప్రతి ఉద్యోగి బాధ్యత

విశాలాంధ్ర-విజయనగరం: నహ ఉద్యోగుల కష్టాలలో పాలుపంచు కోవడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అభిప్రాయపడ్డారు. కార్పొరేషన్ కార్యాలయంలో డిఓగా సేవలందిస్తున్న వెంకట్రావు కుటుంబం ఆరోగ్య పరిస్థితి దయనీయంగా ఉన్నదని గ్రహించిన సహ ఉద్యోగులు అందరూ ఆయనకు అండగా 25వేల రూపాయలను అందజేశారు. మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు ముందుకు వచ్చి వెంకట్రావు పరిస్థితిని వివరిస్తూ నిధుల సేకరణకు పూనుకొనగారు. దీంతో సమకూరిన లక్ష 25 వేల రూపాయలను సోమవారం కమిషనర్ ఛాంబర్ లో వెంకటరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నరసింగరాజు, మూర్తి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయం -పంచాయతీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీఎన్జీజీవో సంఘం కృషి

విశాలాంధ్ర-భోగాపురం: సచివాలయం, పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి ఏపీఎన్జీజీవో సంఘం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని జిల్లా కార్యదర్శి ఏ. సురేష్ హామీ ఇచ్చారు. సోమవారం మధ్యాహ్నం భోగాపురంలో నిర్వహించిన సచివాలయం పంచాయతీ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "ఉదయం 6 గంటలకు కార్యదర్శులను విధుల్లోకి రప్పించడం భావ్యం కాదు. అనేక సమస్యలతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. వీటిని అంచెలంచెలుగా పరిష్కరించేందుకు సంఘం కృషి చేస్తుంది" అని పేర్కొన్నారు.ఈ నెల 18న రాష్ట్ర ఏపీఎన్జీజీవో అధ్యక్షుల ఆధ్వర్యంలో పంచాయతీ కమిషనర్, సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లేందుకు చర్యలు ప్రారంభించామని ఆయన తెలిపారు. పీఆర్‌సీ, ఐఆర్డీఏ వంటి అంశాల పరిష్కారానికి ఉద్యోగులు ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని సురేష్ పిలుపునిచ్చారు.జిల్లా అధ్యక్షులు శ్రీధర్ మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఏపీఎన్జీజీవో సంఘం ముందంజలో ఉంటుందని అన్నారు. భోగాపురం తాలూకా అధ్యక్షులు కొమ్మూరు దుర్గారావు మాట్లాడుతూ, ఉద్యోగులు ఐక్యతతో ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. కార్యదర్శి అప్పలనాయుడు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు ఎవరికీ చెప్పుకోలేని ఇబ్బందులు పడుతున్నారు. వీటి పరిష్కారానికి సంఘం కృషి చేస్తుంది" అని స్పష్టం చేశారు.ఉద్యోగుల ప్రతినిధులు అచ్చుతరావు, రమణమ్మ, మండల ఏఓ కామేశ్వరరావు, కొమ్మూరు చిన్నారావు, బి. లక్ష్మణ్, పట్టణ సంఘం కార్యదర్శి ఆనంద్ కుమార్ తదితరులు ఉద్యోగుల సమస్యలపై మాట్లాడారు. అనంతరం ఏపీఎన్జీజీవో సభ్యత్వ పత్రాలను ఉద్యోగులకు అందజేశారు.

మండుటెండలో యూరియాకై రైతులు పడిగాపులు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్ కోట పట్టణం కేంద్రంలో గల జె.కె అగ్రి ఇండియా ట్రేడర్స్ ఎరువుల దుకాణం వద్ద యూరియా కోసం రైతులు ఉదయం నుండి బారులు తీరారు. మహిళలు వృద్ధులు మండుటెండలో నిలబడి యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం యూరియా రైతు భరోసా కేంద్రం లో సరఫరా చేసినప్పటికీ అవి పంట పొలాలకు చాలక రైతులు ఎరువుల దుకాణం వద్ద యూరియా కోసం క్యూ కట్టవలసిన పరిస్థితి నెలకొంది. ఎరువుల దుకాణం వద్ద రైతులు ఆధార్ కార్డ్ తీసుకొస్తే సరిపోతుందని దుకాణదారుడు ముందుగా చెప్పినప్పటికీ, రైతులు ఎక్కువ అయ్యేసరికి ఇప్పుడు వన్ బి, పాస్ పుస్తకం,ఆధార్ కార్డు తీసుకురావాలి అని అనడంతో మళ్లీ రైతులు వన్ బి, పాస్ పుస్తకాల కోసం వారి గ్రామాలకి వెళ్లి తెచ్చుకోవలసిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన చెందారు. ఇప్పటికైనా పాలక ప్రభుత్వం స్పందించి రైతులకు పూర్తిస్థాయిలో యూరియా అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ..

ఆరోగ్య పరిరక్షణకు వైద్య ఆరోగ్యశాఖ అవగాహన

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఈనెల 17న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన సందర్భం గా దేశ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వైద్య ఆరోగ్యశాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా ఎస్.కోట మండలం కొత్తూరు గ్రామంలో సోమవారం సర్పంచ్ సిహెచ్ లక్ష్మి ఆధ్వర్యంలో కరపత్రాలను చూపించి అందులో ఉన్న విషయాలను చదివి వినిపించారు ఇంటింటికి తిరిగి ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు మహిళలకు గర్భసంచి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్,బీపీ,షుగర్,టిబి స్త్రీల ఆరోగ్య స్థితిని, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు, వంటి విషయాలపై వివరించారు ఏఎన్ఎం బి స్వప్న కుమారి ఆశా వర్కర్ కోట లక్ష్మి అంగన్వాడీ టీచర్ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మండలంలోనేటి నుండి గాలికుంటు వ్యాధి టీకాలు

విశాలాంధ్ర-తెర్లాం: జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ఈరోజు నుండి వచ్చేనెల 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెర్లాం మండల పశువైద్యాధికారి డాక్టర్ జె నరేంద్ర కుమార్ తెలిపారు ఈరోజు నుండి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రతి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయడం జరుగుతుందని వారు తెలిపారు. వారు మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి లక్షణాలు గురించి రైతులకు జాగ్రత్తలు తెలియజేశారు. ఈ వ్యాధి సోకిన పశువుల్లో నోటి నుండి తీగల మాదిరి సొంగ కారడం నోటి మధ్య పుండ్లు, ఖాళీ గిట్టల మధ్య గాయాలు తీవ్రమైన జ్వరం నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయి అని చెప్పారు. ఈ వ్యాధి కారణంగా పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోవడం ఎద్దుల్లో పని సామర్థ్యం తగ్గిపోవడం అలాగే పాలు త్రాగే దూడల్లో మరణాలు సంభవించవచ్చు రైతులందరూ పశువులకు సకాలంలో టీకాలు వేయడం ద్వారా గాలికుంటు వ్యాధి సోకకుండా నిరోధించవచ్చని వ్యాధి సోకిన పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గకుండా కాపాడువచ్చని చెప్పారు. మండలంలో ఉన్న రైతు సోదరులందరూ గాలికుంటు వ్యాధి టీకా వేయించాలని రైతులకు పశు వైద్యాధికారి నరేంద్ర తెలిపారు.

ఆటో డ్రైవర్లు వాహన మిత్ర దరఖాస్తు చేసుకోవాలి

టిడిపి పట్టణ అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణంలోని ఆటో డ్రైవర్లు వాహన మిత్ర పథకానికి తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని టిడిపి పట్టణ అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే బేబీ నాయన పిలుపు మేరకు ఈ ప్రకటన చేస్తున్నట్లు తెలిపారు.దసరా కానుకగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆటో డ్రైవర్లకు రూ.15 వేల ఆర్థిక సహాయం ప్రకటించారని, గత ప్రభుత్వం ఇచ్చిన రూ.10 వేల సాయాన్ని కూటమి ప్రభుత్వం పెంచిందని పేర్కొన్నారు. ఈ నెల 17 వ తేదీ వరకు గడువు ఉన్నందున ఆ లోపు దరఖాస్తులు పూర్తి చేయాలని సూచించారు.అలాగే పార్టీ కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా ఏర్పడి దరఖాస్తు ప్రక్రియ తెలియని వారికి సహాయం చేసి, తమ నాయకుడు ఎమ్మెల్యే బేబీ నాయనకు మంచి పేరు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గెంబలి శ్రీనివాసరావు కోరారు.

ఘనంగా ఇంటర్నేషనల్ డెమోక్రసీ దినోత్సవం

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్ కోట పట్టణంలో ఉన్న ప్రభుత్వ శాఖ గ్రంథాలయంలో సోమవారం ఓటరు అక్షరాస్యత వేదిక ఆధ్వర్యంలో సెప్టెంబర్ 15 ఇంటర్నేషనల్ డెమోక్రసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. కార్యక్రమంలో ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు డి సూర్యరావు మాట్లాడుతూ ఈ దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవడం జరుగుతుందని, దీని యొక్క ముఖ్య ఉద్దేశం ప్రజాస్వామ్య సూత్రాలను బలపరచడం, ప్రజల్లోకి తీసుకుని వెళ్లి తద్వారా ప్రజాస్వామ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా, 2007 నుంచి ఈ దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజాస్వామ్యానికి ఉన్న ప్రధాన ఐదు లక్షణాలు ఒకటి స్వేచ్ఛ, రెండు సమానత్వం, మూడు పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం, నాలుగు చట్టబద్ధ పాలన, ఐదు స్వయం దిద్దుబాటు, ఈ విషయాలపై ప్రజల్లో చర్చ జరిగి పూర్తి అవగాహన పొందిన్నాడే ప్రజాస్వామ్యం బలపడుతుందని అని అన్నారు, ముఖ్యంగా ప్రజాస్వామ్యంలో ప్రస్తుతం ఉన్న లోపాలు ఒకటి ప్రజలు తమను తాము పరిపాలించుకోవాలని అనుకోక పోవడం, రెండు ప్రజలు తాము యజమానులమనే భావన చేతలలో చూపకపోవడం, మూడు పాలకులు పాలన యంత్రాంగం కిందిస్థాయి ఉద్యోగులు మేము ప్రజలకు సేవకులుగా ప్రజలచే నియమింపబడ్డామని అనుకోక పోవటం, నాలుగు రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యాన్ని ఆచరించకపోవడం, రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం కొరవడటం ఈ లోపాలన్నీ సవరించే బాధ్యత ఈ దేశ ప్రజలపై ఉందని అన్నారు ఈ కార్యక్రమానికి గ్రంథాలయ అధికారి డి శ్రీధర్ వేదిక ప్రతినిధులు ఆర్ సూర్యదేముడు సిహెచ్ రామకృష్ణ మల్ల అప్పారావు గ్రంథాలయ పాఠకులు గ్రంథాలయ సిబ్బంది సూరిబాబు పాల్గొన్నారు.

యూటిఎఫ్ రణభేరి జయప్రదం చేయండి

యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పి గౌరీశంకర్ రావు పిలుపు..

విశాలాంధ్ర-వంగర : మండలం లో గల వంగర, సంగం, ఎంఎస్ఆర్ పురం జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి ఆర్థిక ,విద్యారంగ మరియు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించడంతో అప్పుడు పోరుబాట చేసాం. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలల కాలం గడిచిపోయింది కానీ ప్రభుత్వం ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కరించటంలో చొరవ చూపకపోవడం తగదన్నారు. విద్యారంగ సమస్యలు నానాటికి ఉత్పన్నం అవుతున్నాయి బోధనేతర పనులు రద్దుచేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని ,ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేయడానికి కృషి చేయాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం తన విద్యా విధానాన్ని ప్రకటించాలని కోరారు. 11వ పిఆర్సీ బకాయిలు చెల్లించాలని నాలుగు విడుదల డీఏలను వెంటనే చెల్లించాలని 12వ పిఆర్సీ కమిషన్ ను వెంటనే వేయాలని ఉద్యోగులు ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగు యుటిఎఫ్ రణభేరి కార్యక్రమంలో భాగంగా ఉత్తరాంధ్రలో సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు జరుగు రణభేరి బైక్ జాతాను ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అధ్యక్షులు బి ప్రసాద్ మాట్లాడుతూ విజయనగరం జిల్లా రణభేరి జాత సెప్టెంబర్ 17వ తేదీన బొబ్బిలిలో ఉదయం 8 గంటల కు ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి బి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కె రమణ, పి మురళి, రాజేంద్రప్రసాద్, బాలకృష్ణ, పి నిరంజన్ పాల్గొన్నారు

యూరియాపై ఆందోళన వద్దు: ఆర్డిఓ కీర్తి

విశాలాంధ్ర-దెంకాడ: రైతులు ఎవరు యూరియా పై ఆందోళన చెందవద్దని జిల్లా రెవెన్యూ అధికారి ఆర్డీవో. కీర్తి తెలిపారు, జిల్లాలోని రైతులు ఎవరు యూరియా విషయమై ఆందోళన చెందవద్దని ఆర్డీవో బి కీర్తి తెలిపారు, మండలంలోని సోమవారం చొల్లంగి పేట రైతు సేవ కేంద్రం వద్దకు వచ్చిన యూరియా పంపిణీ పై రైతులు తీవ్ర ఆందోళన చేశారు, జిల్లా రెవెన్యూ అధికారి డి కీర్తి, విజయనగరం సబ్ డివిజన్ ఏడిఏ నాగభూషణరావు, తాసిల్దార్ రాజారావు, పోలీసులు, వ్యవసాయ అధికారిని పి సంగీత వెంటనే స్పందించి యూరియా పంపిణీ విషయం పై రైతులు ఆందోళన చెందవద్దని రైతులకు కావలసిన యూరియాను పంపిణీ చేస్తామని తెలిపారు, చల్లగా పేట రైతు సేవా కేంద్రానికి 173 బస్తాలు యూరియా రాగా ఉదయం రైతులకు పంపిణీ చేయడం మొదలు పెట్టడం జరిగింది, చొల్లంగి పేట రెవెన్యూ ఆరు గ్రామాల రైతులు 250 మంది వచ్చి అందరికీ కంపెనీ కోసం క్యూలో నిలబడడం వల్ల చివరగా నిలబడిన వారు యూరియా అనుదేమో అన్న ఆందోళనతో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది, అందరికీ సరిపోయినంత యూరియా వచ్చిన తర్వాత పంపిణీ మొదలు పెట్టమని రైతులు వ్యవసాయ శాఖ అధికారులను కోరడంతో యూరియా పంపిణీ నిలిపివేసి , జిల్లా కంట్రోల్ రూమ్ కు తెలియజేయగా వెంటనే ఇంకొక 266 బస్తాలు విజయనగరం నుండి తరలించి చల్లంగిపేటలోని 6 రెవెన్యూ గ్రామాల రైతులకు పంపిణీ చేశారు, యూరియాను రైతులకు పంపిణీ సజావుగా సాగించామని ఏడిఏ నాగభూషణరావు లో తెలిపారు,

జిఎంఆర్ఐటి రాజాం లో మ్యానుఫ్యాక్చరింగ్ & ఇండస్ట్రీ 4.0 పై ఎఫ్.డి.పి. ప్రారంభం

విశాలాంధ్ర-రాజాం : జి.ఎం.ఆర్. ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (జి.ఎం.ఆర్.ఐ.టి.) మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో, అఖిల భారత సాంకేతిక విద్యా మండలి - అటల్ స్పాన్సర్డ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను "మ్యానుఫ్యాక్చరింగ్ & ఇండస్ట్రీ 4.0" అనే అంశంపై ఆదివారం ఆన్‌లైన్ మోడ్‌లో ఘనంగా ప్రారంభించారు. ఈ శిక్షణా కార్యక్రమం సెప్టెంబర్ 19 వరకు కొనసాగుతుంది.ప్రారంభోత్సవ సెషన్‌కు ముఖ్య అతిథిగా అమేస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో మ్యానుఫ్యాక్చరింగ్ %౦% ఇండస్ట్రీ 4.0 మేనేజర్ శ్రేయాన్స్ ఖోట్ పాల్గొని, ఎడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ యొక్క భవిష్యత్ ప్రాధాన్యతను వివరించారు. ఇది ఆరోగ్య రంగం, బయోటెక్నాలజీ, ఇంజనీరింగ్ వంటి విభాగాలలో విస్తృత అవకాశాలను కల్పిస్తుందని, ఆధునిక పరిశ్రమల్లో డిజిటలైజేషన్, ఆటోమేషన్‌తో కలిసి ఇది కీలక పాత్ర పోషించనుందని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ జె. గిరీష్ (డైరెక్టర్ %-% ఎడ్యుకేషన్, జి.ఎం.ఆర్.వి. ఫౌండేషన్), డాక్టర్ సి.ఎల్.వి.ఆర్.ఎస్.వి. ప్రసాద్ (ప్రిన్సిపాల్, జి.ఎం.ఆర్.ఐ.టి.), డాక్టర్ జి. శశికుమార్ (హెచ్ఓడి, మెకానికల్ ఇంజినీరింగ్) పాల్గొని మ్యానుఫ్యాక్చరింగ్ %౦% ఇండస్ట్రీ 4.0 సాంకేతికతపై ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమాన్ని కన్వీనర్ డాక్టర్ ఎ.ఎల్. నాయుడు, కో-కన్వీనర్ డాక్టర్ వి.ఎన్.ఎల్. పావని సమన్వయం చేశారు.ఈ ఆరు రోజుల శిక్షణా కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న 120 కి పైగా ప్రసిద్ధ సంస్థల అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొనడం విశేషం.